# ధార్మిక జీవితం అంటే?

రచన: బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి



# ధార్మిక జీవితం అంటే?



రచన : బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

మొదటి ముద్రణ : మార్చి, 2026
ప్రతులు : 2,000

వెల : రూ. 60/-

పుస్తకముల కొరకు :-
**తటవర్తి వీరరాఘవరావు,**
తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.
సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 11) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 12) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 13) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 14) పంచకోశాలు | - | రూ.60/- |
| 15) మనస్సు యొక్క స్థితులు | - | రూ.60/- |
| 16) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 17) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 18) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 19) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 20) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

# ధార్మిక జీవితం అంటే?

మీరు ఎన్నో రోజుల నుంచి ఈ ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్నారు, ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నారు. కానీ మీకు నేర్చుకోవాల్సింది ఇంకా కనిపిస్తూనే ఉంది. ఈ జ్ఞానం అనేది అనంతం కానీ కొంతమంది అభిప్రాయంలో కొన్ని విషయాలు వృధా అనుకుంటారు. కానీ సృష్టికర్త సృష్టిలో సృష్టించినది ఏది వృధా కాదు, అందుచేత అన్ని విషయాలు తెలుసుకుంటూ వాటినుంచి పాఠాల్ని నేర్చుకోవాలి.

ఈ ధ్యాన జీవితంలో ఇంకా ముందు ముందుకి ఎదగాలి అనుకుంటే దేనిని ఆచరించాలి అన్నది తెలుసుకోవాలి. పూర్వకాలం నుంచి మహాత్ములు, మహర్షులు మానవులకు విధి, విధానాలు బోధించారు.

ఎవరైతే ధార్మికమైన జీవితం జీవిస్తారో వాళ్ళకే దుఃఖం నివారణ అవుతుంది. ధార్మికమైన జీవితము అంటే ధర్మవంతమైన జీవితం. అందుకే బుద్ధుడు "ధర్మం శరణం గచ్ఛామి" అని చెప్పడం జరిగింది. అంటే ధర్మాన్ని ఎవరైతే శరణు వేడుతారో వాళ్ళు గొప్పవాళ్ళు అవుతారు. ధర్మాన్ని శరణ వేడినవాడే సత్యాన్ని తెలుసుకోగలడు.

మీరు అనుకోవచ్చు నేను ఆత్మ, అంటే భగవంతుడు అని తెలుసుకున్నాను, విగ్రహం దేవుడు కాదని తెలుసుకున్నాను, సత్యం తెలుసు కున్నాను, కానీ ఆ సత్యాన్ని ఎందుకు దర్శించలేక పోతున్నాను? అంటే దానికి కారణం ధర్మాన్ని ఆచరిస్తేనే సత్య దర్శనం అని మహాత్ములు చెప్పారు. మరి ధర్మాన్ని ఎలా ఆచరిస్తాం? అసలు ధర్మం అంటే ఏమిటి? అన్నవి తెలుసుకోవాలి.

సత్యాన్ని తెలుసుకోవాలి అంటే ధర్మమైన జీవితం జీవించాలని తెలుసుకోవాలి. అందుకే "ధర్మం శరణం గచ్ఛామి" అని బుద్ధుడు చెప్పాడు.

ప్రతి ఒక్కరికీ మనసును బట్టే శరీరం చేసే పనులు వుంటాయి. కాబట్టి నీ మనసును ధార్మికంగా ఉంచుకుంటే నువ్వు ధర్మానికి ప్రతిరూపం అవుతావు అని తెలుసుకోవాలి.

పూర్వకాలంలో ధర్మాన్ని ఆచరిస్తే శుద్ధ ధర్మం అనేవారట. మనసును ఎవరైతే శుద్ధత్వంలో ఉంచుకుంటారో వారు ధర్మాత్ములు అని పిలవబడేవారట.

ఆ తర్వాత ఆర్యులు, అనార్యులు అన్నారు. ఆర్యులు అంటే అందరికీ మంచిచేసేవారని, అనార్యులు అంటే అందరినీ బాధ పెట్టేవారని రెండుగా విభజించారట. ఈ ధర్మాన్ని కాలక్రమేణ ధర్మము, అధర్మము అని చెప్పడం జరిగింది. ఇప్పుడు చాలా కులాలు, మతాలు, వర్ణాలు వచ్చాయి. మెల్లిగా ధర్మం రూపురేఖలు మార్చేశారు.

అంటే క్రిస్టియన్ ధర్మం, ముస్లిం ధర్మం, హిందూ ధర్మం అనే కాకుండా ధర్మాన్ని కులాన్ని బట్టి తయారు చేస్తున్నారు. మా కులం- మీ కులం, మా మతం- మీ మతం అని ధర్మాలను మారుస్తున్నారు కానీ ఏ మతంలో పుట్టినా ఏ కులంలో పుట్టినా మనసును బట్టే ధర్మం ఉంటుంది, మనకు గుణాన్ని బట్టే ధర్మము ఉంటుంది.

చూడండి అగ్ని ధర్మం కాల్చడం, అగ్ని ధర్మం వేడి, అగ్నిలో చెయ్యి పెడితే దాని ధర్మం ప్రకారం కాలుతుంది. అలాగే మంచు ధర్మం చల్లదనం. ధర్మం కులాలతో, మతాలతో వచ్చింది కాదు.

సూర్యుడి ధర్మం వేడి, చంద్రుడి ధర్మం చల్లదనాన్ని ఇవ్వడం. నీటి ధర్మం అందరికీ ఉపయోగపడటం.

అలాగే ప్రతి మొక్క దాని ధర్మం అది పాటిస్తుంది. కానీ మానవుడే బుద్ధి ఎక్కువై చేయకూడనివి చేస్తూ, చేయవలసినవి వదిలేస్తూ, సొంత పెత్తనాలు చేస్తున్నాడు. మరి ఎవరు ధార్మికుడు అంటే ధర్మాన్ని ఆచరించినవాడే ధార్మికుడు అని చెప్పుకున్నాం.

చూడండి శ్వాస ఉన్న ఏ జీవిని హింసించకూడదు అనే పరమ సత్యాన్ని గురువుగారి దగ్గర నేర్చుకున్నారు. ఎందుకంటే ఆ జీవులన్నీ అనుభవాల కోసం భూమిమీద పుట్టాయే కానీ మీరు తినడం కోసం కాదు అనే ఒక పరమ ధర్మాన్ని తెలుసుకుని ధార్మికమైన జీవితం జీవించాలి. ఇక్కడ గమనించండి ఎవరైతే ధార్మికమైన జీవితం జీవిస్తారో వాళ్ళ జీవితంలో దుఃఖం ఉండదు.

దుఃఖము, ధార్మికము కలిసి ఉండలేవని మహాత్ములు చెప్తారు. ధార్మికమైన జీవితం నువ్వు జీవించగలిగితే నీ జీవితంలో ఎక్కడా దుఃఖం ఉండదు. నీకు ఇంకా దుఃఖం వస్తుంది అంటే నీ జీవితంలో ఎక్కడో తప్పు జరుగు జరుగుతోందని అర్థం, దాన్ని సరిద్దుకోవాలి.

అలాగే మీరు ధ్యాన జీవితంలోకి వచ్చి ఇంకా దుఃఖ పడుతున్నారు అంటే కర్మలు ఉండొచ్చు, లేదా చాలా కారణాలు ఉండొచ్చు. అందుకే లేచిన తర్వాత నుంచి రాత్రి పడుకునే వరకు మాట ద్వారా కానీ, చేత ద్వారా కాని మీ దగ్గర నుంచి తప్పు జరగకూడదు. అది జరిగితే ధార్మికమైన జీవితం జీవిస్తున్నట్టు కాదు. ధార్మికమైన జీవితంలో దుఃఖం ఎప్పుడూ ఉండదు, ధార్మికమైన జీవితం జీవించేవాడికి ధ్యానం చాలా చక్కగా కుదురుతుంది. కారణం వాడు ధర్మానికి కట్టుబడి ఉన్నాడు, ఎలా బ్రతకాలో అలా బ్రతుకుతున్నాడు, ఎలా తినాలో అలా తింటున్నాడు. అదే ధార్మికమైన జీవితం, వాడు ధర్మాన్ని నేర్చుకున్నవాడు. ఎవరికైతే సత్యం మీద ఆసక్తి ఉంటుందో! అంటే ఆత్మ మీద ఆసక్తి ఉందో! అలాంటి వాడు ధార్మిక జీవితం జీవిస్తాడు. అదే బుద్ధుడు చెప్పాడు, పత్రి గారు చెప్పారు, మహాత్ములు చెప్పారు.

**"ధర్మాన్ని నువ్వు రక్షించగలిగితే ఆ ధర్మమే దైవమై నిన్ను రక్షిస్తుంది"** అని. నీకు దైవం యొక్క కృప కావాలి అంటే ఈ భూమిమీద ధార్మికమైన జీవితం జీవించగలగాలి, ధర్మంగా జీవించగలగాలి. ధర్మవంతమైన జీవితం

జీవించగలిగితే నువ్వు ధ్యానంలో పురోగమనం పొందగలుగుతావు. అందుకే ధర్మం విశిష్టత బుద్ధుడు అంత గొప్పగా చెప్పాడు, " ధర్మం శరణం గచ్చామి" అని.

అంటే ధర్మాన్ని శరణ వేడు, ధర్మంలో జీవించు, ధర్మంగా ఉండు, ధర్మవంతమైన జీవితమే దుఃఖ రాహిత్య స్థితి అని మహాత్ములు చెప్పారు.

సద్భావనలు, సదాలోచనలు, సేవ ఇవన్నీ ఉన్నవారు ధర్మవంతమైన జీవితం జీవిస్తారు. దుర్భావనలు, దురాలోచనలు ఉన్నవారు అధర్మ మార్గంలో జీవిస్తారు.

ఏదైనా ఆత్మ శక్తిని పెంచుకోవడంలో ఉంటుంది, దానికి ధ్యానం చేయాలి. శక్తి పెంచుకోక పోతే సత్యాన్ని దర్శించ లేరు, ధర్మాన్ని ఆచరించ లేరు. అందుచేత సాధన చేసి శక్తిని పెంచుకున్నప్పుడు ఏం చేయాలో అది ఖచ్చితంగా చేయగలుగుతారు.

నువ్వు ప్రాపంచిక జీవితంలో ధర్మ మార్గంలో ఉంటే అప్పుడు నీ సాధన సరిగ్గా కుదురుతుంది. మరి అలాంటి ధార్మిక జీవితం జీవించినప్పుడు, ధర్మ మార్గంలో ఉన్నప్పుడు, మీ సాధన చాలా చక్కగా కుదురుతుంది.

గురువులు "శ్వాస మీద ధ్యాస" పెట్టమన్నారు. నీ మనసు యొక్క చంచలావస్థని నిశ్చలావస్థ చేసే శక్తి బయట ఎక్కడా లేదు, "శ్వాస మీద ధ్యాస" కే ఉంది, నీ శ్వాసే నీ మనసును నియంత్రించగలదు.

గురువు చెప్పింది ఆచరించినవాడే ధార్మిక జీవనానికి అర్హుడు, ధర్మాన్ని ఆచరిస్తున్నవాడు. ఆయన అన్ని కాసి వడపోసి ఈ ధ్యానం గొప్పదని బోధించాడు. అందుచేత గురువు చూపించిన మార్గంలో ధార్మిక జీవితం గడుపుతూ, అంటే హింసను ఆపి హంసను పట్టుకొని దైవాన్ని తెలుసుకునే మార్గంలో పయనించాలి.

ఒకటేనండి ధర్మ జీవితం గడుపుతున్నవాడే ధర్మాత్ముడు అవుతాడు, ఆ ధర్మాత్ముడే సత్యాన్ని తెలుసుకునే అర్హత పొందుతాడని తెలుసుకోవాలి.

**"ధర్మాన్ని నువ్వు రక్షిస్తే ఆ ధర్మమే నిన్ను దైవమై రక్షిస్తుంది"** అని పెద్దలు చెప్పారు. తిరుమలలో కూడా అనేక చోట్ల "ధర్మో రక్షతి రక్షిత:" అనే స్లోగన్ రాసి ఉంటుంది. మరి దైవమై రక్షించవలసిన ధర్మం ఆచరించినా, దుఃఖం ఎందుకు వస్తుంది? అంటే మీరు కచ్చితంగా ధర్మాన్ని ఆచరించట్లేదు అని అర్థం చేసుకోవాలి.

మీ జీవితంలో దుఃఖం ఉంది అంటే నేను ఇంకా ధర్మవంతమైన జీవితం జీవించడం లేదు అని తెలుసుకోవాలి. ధర్మాన్ని ఆచరించడం అంటే మీలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవడం.

ధర్మాన్ని ఎప్పుడైతే ఆచరిస్తారో సత్యానికి దగ్గర అవుతారు. ధర్మము అంటే మీరు జీవించే ఒక కళ. ఎందుకు జీవించే కళ అన్నారు అంటే మన జీవన విధానం ధర్మంగా ఉండాలి. ప్రతి విషయంలో ప్రతి నిమిషము ధర్మవంతమైన జీవితం  జీవించగలిగితే అదే జీవన కళ అని చెప్తారు.

మీరు సంతోషంగా ఉంటూ,  ప్రక్క వాళ్ళను కూడా సంతోషంగా జీవింప చేయడమే ధర్మవంతమైన జీవితం. మరి ధర్మవంతమైన జీవితం జీవిస్తున్న మీకు  కష్టాలు ఎందుకు వస్తున్నాయి? అని  ప్రశ్నించుకుంటే "పూర్వ జన్మ కృతం పాపం" అని  చెప్పబడింది. పత్రి గారు కూడా "చిన్నచిన్న పాపాలు చేస్తే చిన్న చిన్న రోగాలు, పెద్ద పెద్ద పాపాలు చేస్తే పెద్ద పెద్ద రోగాలు వస్తాయి, అసలు పాపమే లేకపోతే రోగమే ఉండదు" అని చెప్పారు. ఇంకా కష్టాలు, కన్నీళ్లు ఉన్నాయి అంటే "నేను గత జన్మలో చేసిన కర్మ ఫలాలు అని తెలుసుకోవాలి, అవి ఈ జన్మలో అనుభవిస్తే పోతాయి" అని తెలుసుకొని, ఎన్ని కష్టాలు వచ్చినా నేను ధర్మంగానే జీవించాలి అని నిర్ణయం తీసుకుంటే ఆ కష్టాలను కూడా మీరు అధిగమించవచ్చు, కానీ ఆ కష్టాలను తట్టుకోలేక మళ్ళీ అధర్మ పరమైన జీవితం జీవిస్తే కొత్త కర్మలు వస్తాయి.

కష్టాల్లో కూడా సంతోషంగా ఉంటూ, ధర్మంగా జీవించగలిగినప్పుడే ప్రతి మనిషిలో తృప్తి ఉంటుంది. ఇప్పుడు చూడండి మీరు ఎవరినైనా మోసం

చేశారనుకోండి, ఇంక అక్కడి నుంచి మీకు ప్రశాంతత ఉండదు, తృప్తి కరువై పోతుంది. మీరు నష్టపోయినా,  కష్టాలు పడినా ధర్మవంతమైన జీవితం జీవిస్తే ఆ సంతోషమే వేరు.

ధర్మంగా జీవించినప్పుడు ఆనందం ఎందుకు వస్తుంది? అంటే భగవంతుడు మెచ్చేది అలాంటి జీవితమే. ఎందుకు అంటే ఏ జంతువుకు ఇవ్వని బుద్ధి మానవుడికి ఇవ్వడం జరిగింది. ఆ బుద్ధి వల్ల నిత్య, అనిత్య వస్తు వివేకం, అంటే ఏది సత్యం ఏది అసత్యం, ఏది నిత్యం ఏది అనిత్యం అని గ్రహించ గలిగేంత వివేకంమీకు రావాలి. బుద్ధితో విచారణ చేస్తేనే వివేకం వస్తుంది.

ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన మీరు గురువుల ద్వారా కర్మ సిద్ధాంతం నేర్చుకున్నప్పుడు, ఒక తప్పు పని చేసినా, ఒక పాపపు పనిచేసినా అది ఒక అధర్మకరమైన పని, నేను అధర్మంగా జీవించకూడదు అని ధర్మంగా జీవించగలిగి నప్పుడే ఆనందం వస్తుంది, ఉన్న వాటితో తృప్తిగా జీవిస్తూ ప్రక్క వాడు కూడా ఆనందంగా ఉండేట్లు ప్రయత్నించాలి.

చాలామంది వాళ్ళు ఆనందంగా ఉండాలనుకుంటారు కానీ ప్రక్కవాడు ఆనందంగా ఉండాలని అనుకోరు, మరి అలాంటి జీవితం కూడా ధర్మవంతమైన జీవితం కాదు.  సత్యాన్ని అంటే ఆత్మని దర్శించాలి అంటే ధర్మవంతమైన జీవితమే ఉండాలి.

మీరు ధర్మవంతమైన జీవితం జీవించాలి అంటే పగ, ప్రతీకారం, ద్వేషం అనేవి ఎప్పుడు ఉండకూడదు. సహజంగా కొంతమంది ఇతరులు హాని చేసినా, అన్యాయం చేసినా వారి మీద పగతో రగిలిపోతారు. వాడి మీద ఎప్పుడు ప్రతీకారం తీర్చుకోవాలా? అని అనుకుంటారు. కానీ వాడు ఏదో అజ్ఞానంలో చేశాడు, మనకు జ్ఞానం ఉంది కాబట్టి వాడి మీద ప్రతీకారం తీర్చుకుని మరలా కొత్త కర్మలు చేయడం ఎందుకు? నేను గత జన్మలో వాడికి

ఏదో అన్యాయం చేసి ఉంటాను, అందుకే ఈజన్మలో నాకు వాడితో విరోధం వచ్చింది, అందుకే వాడు ఇలా ఉన్నాడు ” అని  శాంతంగా ఉండాలి. పగ, ప్రతీకారం లేకపోతే  ధర్మాన్ని రక్షించినవారు అవుతారు.

మీకు మహాభారతంలో జరిగిన చిన్న సంఘటన చెబుతాను. ధర్మరాజుని ధర్మరాజు అని ఎందుకు అన్నారు? అన్నది తెలుసుకుందాం. పాండవులు వనవాసం చేసే సమయంలో కౌరవులు పాండవులను చూద్దామని వచ్చారట, అలా వచ్చినప్పుడు వాళ్ళు ఎంతో సుఖంగా ఉండటం చూసి వారి మీద ఎంతో ఈర్ష్య కలిగింది కౌరవులకి. అక్కడ ఒక కొలను ఉంది, ఆ కొలను గంధర్వులది, దుర్యోధనుడు అన్నదమ్ములతో కలసి ఆ కొలనులో స్నానం చేసి, ఇష్టం వచ్చినట్టు కేరింతలు కొట్టి బయటకు వచ్చారు. మరి గంధర్వులు ఊరుకోరు కదా! వచ్చి కౌరవులని బంధించి గంధర్వ లోకానికి తీసుకెళ్లినప్పుడు ఆ సంగతి ధర్మరాజుకు తెలిసింది. అప్పుడు భీముడికి “కౌరవులని విడిపించుకు రమ్మని చెబుతాడు. అప్పుడు భీముడు అదేంటన్నయ్యా వాళ్ళు మన శత్రువులు, మనల్ని ఎన్నో కష్టాలు పెడుతున్నారు, వాళ్ళ మీద నువ్వు జాలిపడతావు ఏంటి?” అని భీముడు అడిగినప్పుడు ధర్మరాజు ఎలా అయినా సరే వాళ్ళు ఆపదలో ఉన్నారు, ఆపదలో ఉన్న వాళ్ళని రక్షించడం క్షత్రియ ధర్మం, నేను క్షత్రియుడిని నా ఎదుటి వాళ్ళు ఆపదలో ఉన్నప్పుడు రక్షించాలి. కాబట్టి మనం ఉన్న చోట వాళ్ళని రక్షించాల్సిన బాధ్యత మనదే అని భీముడిని పంపి కౌరవుల్ని రక్షించటం జరిగింది.

ఇక్కడ మీరు గమనిస్తే ధర్మరాజు “వీళ్ళకీ భలే శాస్తి జరిగింది” అని కౌరవుల మీద పగ, ప్రతీకారం తీర్చుకోకుండా తన ధర్మం ఏమిటో? తాను నిర్వర్తించాడు, అందుకే ఆయన ధర్మరాజు అయ్యాడు.

ధర్మాన్ని ఆచరించాలి అంటే పగ, ప్రతీకారం అనేవి ఉండకూడదు, మరి అలా ఎప్పుడు ఉండగలుగుతారు అంటే మీ మనసు నిర్మలంగా ఉన్నప్పుడు.

టీవీ9 లో పత్రి గారి గురించి వ్రాసినప్పుడు ఆయన ఎంతో సహనంతో ఉన్నారు, ఎందుకంటే "వాడు నీచ స్వభావం కలవాడు, ఎదుటి మనిషి మీద బురద చల్లటం వాడి ధర్మం, కానీ నేను యోగిని కాబట్టి అందరిని క్షమించడం నా ధర్మం" అని అనుకున్నారే కానీ, ఆయన ఒక్క మాట మాట్లాడలేదు, మౌనంగా ఉన్నారు.

ఆ సందర్భంలో  పత్రి గారు నాతో ఒక విషయం చెప్పారు "మూర్ఖులు మీ ఎదురుగా ఉన్నప్పుడు మీరు వాడిని ఏమీ చేయకపోయినా అకారణంగా బాధ పెడుతున్నాడు అంటే వదిలేయాలి అన్నారు. ఎందుకు అంటే వాడు అజ్ఞానంతో, మూర్ఖత్వంలో ఉన్నాడు. వాడు ఆ విధంగా ఉండటానికి కారణం వాడి గుణం, వాడి మనసు అశుద్దంలో ఉంది, వాడు ధర్మంగా జీవించలేదు" అని చెప్పారు.

పత్రి గారు చూడండి తాను ధర్మంలో జీవిస్తూ సాటి జీవులను కూడా రక్షించాలి అనే ఉద్దేశంతో మన అందరికీ శాకాహారం గురించి ఎంతగానో బోధించారు, అది ఆయన ధర్మంగా భావించారు.

మానవ ధర్మం ఏమిటి అంటే మానవుడిగా పుట్టిన ప్రతి వాడు తానెవరో తెలుసుకోవాలి, భగవంతుడు ఎవరో తెలుసుకోవాలి. చివరికి తానే భగవంతుడు అని తెలుసుకోవాలి, ఇదే మానవధర్మం. పత్రి గారు ధర్మంలో జీవించాడు కాబట్టి ఆయన ద్వారా  క్షమించటం అంటే ఏమిటో నేర్చుకున్నారు. సాటి జీవులు కూడా ఆత్మ స్వరూపులే అని తెలుసుకొని, వాటికీ జీవించే హక్కు ఉంది, వాటిని రక్షించటం మానవధర్మం అని తెలుసుకున్నారు. ఈ సృష్టిలో అన్ని జీవుల కంటే శక్తిమంతుడైన మానవుడు, మిగతా అన్ని జీవులను రక్షించాలి అని పత్రి గారు తెలియజేశారు.

మనసును నిర్మలంగా ఉంచుకుంటే ప్రేమ, దయ, సమ భావం, సానుభూతి అనే లక్షణాలు వస్తాయి. సాటి జీవులను ప్రేమించాలి. ఎందుకు అంటే? అవి కూడా మీ లాగే ఆ పరమాత్మ స్వరూపులే అని మీరు పత్రి గారి

దగ్గర నేర్చుకున్నారు.

అలాగే నీ కన్నా క్రింది వారి మీద  దయ చూపించాలి, అంటే ఎదుటి వాడు నీకన్నా డబ్బు లో కానీ, పదవిలో కానీ శక్తిహీనుడైతే,  దయతో వాడికి కొంచెం సహాయం చేయాలి.

అలాగే  "నేనే గొప్ప" అని అనుకుంటూ ఉంటారు, కానీ అందరూ ఆత్మలే అని నువ్వు తెలుసుకున్న రోజు అందరి మీద సమ భావం చూపిస్తావు. ఎవరికైనా కష్టాలు వచ్చినప్పుడు "అయ్యో వాడు అజ్ఞానంతో తప్పులు చేసి, పాపాలు చేసి, కష్టాలు పాలవుతున్నాడు" అని సానుభూతి చూపించాలి. మరి ఇలాంటి లక్షణాలు ఎప్పుడు వస్తాయి అంటే మనసు నిర్మలంగా ఉంచుకున్న రోజు, ఇలాంటి ధర్మాల్ని ఆచరిస్తారు.

ఇంకా కొంతమంది మూర్ఖులు ప్రక్కవాడు నాశనం అయిపోయినా పర్వాలేదు అని వాడిని బాధపెడతారు. ఇది కూడా అధర్మపరమైన లక్షణం, ఇలాంటి వారు ప్రక్కవాడి గురించి అస్సలు ఆలోచించరు, కాని ప్రక్కవాడి గురించి ఆలోచించగలిగే బుద్ధి ఒక్క మానవుడికి మాత్రమే ఉంది, మిగతా ఏ జీవులకి లేదు.  మనసు అశుద్ధంగా ఉంటే అధర్మంలో ఉంటారు, మనసు శుద్ధత్వంలో ఉంటే ధర్మవంతమైన జీవితం జీవిస్తారు.

మీ మనసు శుద్ధత్వంలో ఉన్నప్పుడు ప్రక్కవాడి మీద ప్రేమ, దయ, సానుభూతి చూపిస్తావు అంటే ధర్మాన్ని ఆచరిస్తావు, నీ మనసు అశుద్దంగా ఉంటే ప్రక్కవాడి మీద పగ, ప్రతీకారం, ద్వేషంతో ఉంటావు.

ధర్మం మనకి ఏమి నేర్పుతుంది అంటే సాటి మనుషులతో ఎలా ఉండాలి? సాటి జీవులతో ఎలా ప్రవర్తించాలి? మంచి జీవితం ఎలా జీవించాలి? అనే విషయాలు నేర్పుతుంది.

మరి సాటి జీవులు కూడా నా లాగే ఆ పరమాత్మ నుంచి ఆత్మగా భూమి మీదకు వచ్చినవే, దేహాలు వేరుగా కనిపిస్తున్నాయి కానీ అందరూ

ఆత్మలే అని మీరు తెలుసుకున్నారు. అలాగే ఆత్మైన మీరు భగవంతుడు అని తెలుసుకోవాలి అంటే ధర్మంగా జీవించాలి, ధర్మంగా జీవించిన రోజున శాంతిని పొందుతారు, శాంతిని పొందాలి అంటే ఎదుటివారిని బాధపెట్టకుండా ఉండాలి, అజ్ఞానంతో, అహంకారంతో ఎదుటి వాడిని బాధపెడితే ఆత్మనుంచి వేదన మొదలవుతుంది. మీరు సుఖంగా జీవించటమే కాదు, ప్రక్కవాడిని కూడా సుఖంగా జీవించేటట్లు చేయటమే ధర్మం, అదే పరిపూర్ణమైన శుద్ధత్వం.

పరిపూర్ణమైన శుద్ధత్వం అనేది ఒక్క రోజులో వచ్చేది కాదు, ధర్మవంతమైన జీవితం జీవిస్తూ, ఏ రోజుకా రోజు మీ మనసులోని మురికి భావాలు ధ్యానం ద్వారా పోగొట్టుకోవాలి. ప్రతి రోజు సాధన చేస్తున్న మీరు ఒక రావణాసురుడిలా కాకుండా, ఒక కుంభకర్ణుడిలా కాకుండా కనీసం విభీషణుడు లాగ మారాలి. ఎందుకు అంటే విభీషణుడు చెడు చేయకూడదు అని చెప్పాడు

ధ్యానం చేస్తున్న ప్రతి ఒక్కరూ పరిపూర్ణమైన శుద్ధత్వంలోకి రాలేరు. ఏ క్షణాన మీ మనసు ధర్మానికి కట్టుబడిందో, ఎప్పుడైతే మీరు ధర్మవంతమైన జీవితం జీవిస్తారో! అప్పుడే మీరు పరిపూర్ణమైన శుద్ధత్వంలోకి వచ్చినట్లు.

ధర్మాన్ని బోధించే వారికి ప్రకృతి సహకారం అందిస్తూ ఉంటుంది. ఎందుకు అంటే ధర్మాన్ని బోధించటం అంటే సత్యానికి దగ్గర అవ్వడం. బాహ్యంగా ప్రకృతి మనకు అడుగడుగునా సహకరిస్తూ, మన జీవితంలో మంచి ఫలితాలు వచ్చేటట్లు చూస్తుంది. మనం ధర్మాన్ని ఆచరించినప్పుడే ఇతరులకు ధైర్యంగా బోధించగలం. అందుకే పెద్దలు ఆచరించి చెప్పేవాడు ఆచార్యుడు అవుతాడు అని చెప్పారు. ఈ మార్గంలోకి వచ్చిన మీరందరు ధ్యానం చేయండి, మాంసాహారం మానండి అని అందరికి చెబుతూ ఉంటారు. కానీ ఆచరించకుండా ఏ విషయం అయినా ఇతరులకు బోధించినప్పుడు ప్రకృతి ఒప్పుకోదు.

మీరు ధ్యాన మయ, ధర్మమయ జీవితం జీవించినప్పటి నుంచి ప్రకృతి మిమ్మల్ని తల్లిలా కాపాడుతుంది. అందుకే ఎప్పుడు ప్రకృతిని తల్లితో పోలుస్తారు, స్త్రీ తత్వంతో పోలుస్తారు. అంటే మిమ్మల్ని కాపాడేది, చిన్నప్పటి నుంచి పెంచి పోషించేది తల్లి. మరి ఆ విధంగా ప్రకృతి మన బాహ్యావసరాలన్నీ తీర్చడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఏ క్షణాన నువ్వు ధర్మాచరణ మొదలు పెట్టావో నీకన్నీ విజయాలే, పరాజయం ఉండదు, అపజయాలు ఉండవు. ధర్మంగా జీవించినవాడు ఒకటి సత్యానికి దగ్గర అవుతాడు, రెండు ధైర్యవంతమైన జీవితం జీవిస్తాడు, మూడు ఆనందకరమైన జీవితం జీవిస్తాడు. అందుకే ధర్మంగా, ఆనందంగా ఉన్నవారి చుట్టుపక్కల ఉండడానికి అందరూ ఇష్టపడతారు.

మరి అధర్మపరుడి నీడను కూడా సోకడానికి ఇష్టపడరు. అంటే మరి ధర్మం విలువ భూమిమీద ఎలా ఉందో? తెలుసుకోవాలి. అంటే కొంతమంది అంటారు అధర్మంగా ఉన్నవారి చుట్టూ జనం చేరినా అది తాత్కాలికం, అది తాత్కాలిక ఆనందాలు, తాత్కాలిక భోగాలు, తాత్కాలిక సంతోషాలు ఇస్తాయి.

మీరు గమనించండి "ధర్మానికి ఆయుష్షు చాలా పెద్దది, అధర్మానికి ఆయుష్షు చాలా చిన్నది". తాత్కాలికంగా విజయం లభించినా అధర్మపరుడు, శాశ్వతమైన దుఃఖంలో ఉంటాడు. కానీ ధర్మపరుడు తాత్కాలికంగా కష్టాలు పడినా, శాశ్వతమైన ఆనందంలో ఉంటాడు.

మరి సత్య హరిశ్చంద్రుడు తన ధర్మానికి తాను కట్టుబడ్డాడు. అబద్ధం ఆడను అని మాట ఇచ్చాడు, అదే కష్టాలకి కారణం అయింది. హరిశ్చంద్రుడి చేత అబద్ధం ఆడించాలని విశ్వామిత్రుడు ఎంతో ప్రయత్నించాడు కానీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి ఎన్నో కష్టాలు పడ్డాడు, కానీ అధర్మం వైపు వెళ్ళలేదు.

అలాగే ధర్మరాజుని తీసుకున్నా ధర్మానికి కట్టుబడ్డాడే కానీ అధర్మం

వైపు వెళ్ళలేదు కాబట్టే ధర్మరాజు అయ్యాడు.

మరి ఈ విధంగా చూసుకుంటే ధర్మంగా జీవిస్తే తాత్కాలికమైన కష్టాలు రావచ్చు కానీ శాశ్వతమైన ఆనంద స్థితిలో ఉంటారు. ఈ మార్గంలోకి వచ్చిన మీరు "శ్వాస మీద ధ్యాస" పెట్టి గంటలు గంటలు ధ్యానం చేస్తున్నారు, కానీ ఎవరికి వారు ధర్మంగా జీవిస్తున్నామా? లేదా? అని విచారణ చేసుకోవాలి.

ధర్మం అనేది సనాతనమైనది. ఈరోజు కొత్తగా పుట్టినది కాదు, ఇప్పుడు ఉండి, రాబోయే కాలంలో కూడా ఉంటుంది. సనాతనం అని దేన్ని అంటారంటే ఒకప్పుడు ఉండి ఒకప్పుడు వుండని సనాతనం కాదు, ఎల్లప్పుడూ ఉండేదే సనాతనం. అందుకే ధర్మాన్ని ఆచరించినవాడు దైవానికి దగ్గర అవుతాడు, దైవానికి ఇష్టుడు అవుతాడు. మరి సరైన ధ్యానం చేసి మీలోని దుర్గుణాలు పోగొట్టుకుంటే ధర్మవంతమైన జీవితం జీవిస్తే ఈ జన్మలోనే దైవాన్ని దర్శించ గలిగే శక్తిని, సత్యాన్ని దర్శించగలిగే శక్తిని పొందుతారు.

ఎప్పుడైతే ఈ మార్గంలోకి వచ్చి దైవం కోసం అన్వేషణ చేస్తున్నారో అప్పటినుంచే మీరు ధర్మంగా ఉండాలి, ఈ మనసుని నిర్మలంగా ఉంచుకోవాలి.

ప్రతి రోజు రాత్రి నిద్రపోయే ముందు నేను ఈరోజు ఏమైనా తప్పు చేశానా? ఏమైనా పాపం చేశానా? ఎవరికైనా ద్రోహం చేసేనా? అని ఎవరికివారు విచారణ చేసుకోవాలి.

ఎందుకంటే? బుద్ధ భగవానుడు **"తెలియక చేసిన తప్పులకి చిన్న శిక్ష, తెలిసి చేస్తే ఆ తప్పులకి పెద్ద శిక్ష"** అని చెప్పాడు. అందుకే మనసు శుద్ధత్వంలో ఉంచుకొని ధర్మాన్ని ఆచరించాలి.

మీ వల్ల చీమకు కూడా అపకారం జరగ కుండా చూసుకోవాలి. మరి ఈ విధంగా ఎవరికీ అపకారం చేయకుండా, ధర్మాన్ని ఆచరిస్తే దైవానికి దగ్గరవుతారు.

అందుకే అంతరంలో ధ్యానం, బాహ్యంలో ధర్మం, ఈ రెండే మిమ్మల్ని దైవానికి దగ్గర చేస్తుందని తెలుసుకోవాలి.

# అధర్మంగా జీవించటానికి కారణాలు ఏంటి? అలా జీవించటం వలన కలిగే నష్టాలు ఏంటి?

మానవులు అధర్మంగా ఎందుకు జీవిస్తున్నారు? అధర్మంగా జీవించడానికి కారణం ఏమిటి? మరి అధర్మంగా జీవించేవాళ్ళు ఎలాంటి ఫలితాన్ని పొందవలసి వస్తుంది? అనే విషయాల గురించి తెలుసుకుందాం.

ఈ ధ్యాన మార్గంలోకి వచ్చిన మీరు ధర్మంగా జీవించగలిగితే ధ్యానం చక్కగా కుదురుతుంది, అలాగే దైవానికి దగ్గర అవుతారు.

మరి అధర్మ మార్గంలో జీవిస్తే ఆ కర్మలు అనుభవించడానికి భూమి మీద మళ్ళీ జన్మ తీసుకోవాలి. అలా కాకుండా అధర్మ మార్గంలో ఉన్నప్పుడు ఆ జన్మలో ఎన్ని కష్టాలు వస్తాయో! ఎన్ని బాధలు వస్తాయో! ఈరోజు తెలుసుకుందాం.

ఎందుకు ధర్మం తెలిసినా కొంతమంది అధర్మంగా జీవిస్తారు? అంటే వాళ్ళ మనసు మలినమై, అశుద్ధమై ఉన్నప్పుడు, అధర్మ మార్గంలో జీవించే వారు ఎక్కువగా కనిపిస్తారు. అలాంటి వారు పైకి ఎన్నో మంచి మాటలు చెబుతారు కానీ వారి మనసు మలినమైనందున అధర్మ మార్గంలో జీవిస్తూ ఉంటారు. మనసు శుద్ధత్వంలో ఉంటే ధర్మంలో ఉంటారు, అపరిశుద్ధంలో ఉంటే అధర్మ మార్గంలో ఉంటారు. మరి ఈ అధర్మ మార్గంలో ఉన్న వాళ్ళు ఎదుటి వాళ్ళకి ఎప్పుడూ కీడు చేస్తూ ఉంటారు.

ఇలాంటి వారు ఇతరులకు కీడు చేశాము అని అనుకుంటారు, కానీ తమకు తామే కీడు చేసుకొంటున్నాము అనే విషయం వాళ్ళకి తెలియదు. అంటే నేను లాభం పొందుతున్నాను అని అనుకుంటారు, కానీ ఎప్పుడైతే ఎదుటివారికి కీడు చేస్తాడో అప్పుడు వాడికి వాడే కీడు చేసుకుంటున్నాడు అని తెలియదు. ఎందుచేతనంటే? దాని వల్ల వాడికి వచ్చే కష్టాలు వాడికి

తెలియదు. వాడి వల్ల తాత్కాలికంగా ఎదుటి వాడు నష్టపోవచ్చు, కానీ తాను దుఃఖం వైపు అడుగులు వేస్తున్నాను అనే విషయం వాడికి తెలియదు.

"ధర్మం చాలా గొప్పది, పదునైన వజ్రాయుధం లాంటిది". **"ధర్మం ధర్మపరులను రక్షిస్తుంది, అధర్మపరులను శిక్షిస్తుంది".** అధర్మపరుడు వాడికి వాడే శిక్ష వేసుకుంటాడు ఎందుకు అంటే ఎదుటి వాడిని మోసం చేశాను అని అనుకుంటాడు కానీ వాడు అజ్ఞానంలో జీవిస్తూ పాత వాసనలు, పాత సంస్కారాల వల్ల వాడి మనసు మలినమై, వాడు చేసే పాప కర్మల మూలంగా వాడికి పడే శిక్ష వాడు వేసుకున్నట్టే!

కారణం వాడు అధర్మంగా జీవించడమే. కాని జ్ఞానవంతుడు ధర్మంగా జీవిస్తాడు. మరి ఈ విధంగా తెలుసుకున్నప్పుడు అందరూ ధర్మంగానే ఉంటారు. కానీ ఇలాంటివి తెలుసుకున్నా ఆచరించడానికి ఎంతో నిగ్రహ శక్తి ఉండాలి, మరి నిగ్రహ శక్తి సంపాదించుకోవాలి అంటే ధ్యానం ఒక్కటే మార్గం. జ్ఞానం పొందాలి అనుకునే జ్ఞానులు పొరపాటున కూడా అధర్మ మార్గంలోకి వెళ్ళరు.

కోపం ఎప్పుడు రావాలి అంటే అధర్మం మితి మీరినప్పుడు, కానీ చిన్న చిన్న విషయాలకి కాదు. మరి ఇలా అధర్మంగా జీవించే వారి దగ్గరికి, కోపిష్టులు దగ్గరికి ఎవరైనా వెళ్ళాలంటే భయపడతారు. కాని అధర్మ మార్గంలో జీవిస్తే భగవంతుడి చేత శిక్ష తప్పదు.

అధర్మ మార్గంలో జీవించే వారికి "నువ్వు పాపం చేస్తున్నావు, చనిపోయిన తరువాత నరకానికి వెళ్తావు అని చెబితే, ఆ నేను చనిపోయాక ఏది వస్తే నాకేంటి, ఇప్పుడు నేను సుఖంగా ఉన్నాను" అని కొంతమంది అంటారు. అంటే చచ్చాక ఏమవుతుందో వారికి తెలియదు, జ్ఞానం తెలిసిన వారు బోధించినా వారి తలకు ఎక్కదు, అందుచేత అధర్మం పక్షానే ఉంటారు, అధర్మంగానే జీవిస్తారు.

సహజంగా అధర్మంగా జీవిస్తే చనిపోయాక అనుభవించాల్సి వస్తుంది అనుకుంటారు, కానీ జీవించి ఉన్నప్పుడే వారికి వేదన తప్పదు, సుఖ శాంతులు ఉండవు. అలాంటివారు సుఖంగా నిద్రపోలేడు, శాంతిగా జీవించలేడు.

అధర్మ కార్యాలు చేసిన వెంటనే శిక్ష పడదు. కాని రెండు, మూడు తప్పులు నుంచి వాడి పతనం ప్రారంభం అవుతుంది. కానీ వాడు అధర్మం వైపే ఉంటే అప్పుడు ప్రకృతి కఠినమైన శిక్ష వేస్తుంది.

చాలామంది ఏమనుకుంటారంటే? చనిపోయాక ఏమవుతుందో మనకేం తెలుసు, ఇప్పుడు నచ్చింది తినాలని మూగ జీవులను చంపి వాటి మాంసం తింటూ ఎంజాయ్ చేస్తూ బ్రతికే వాళ్ళు చాలామంది ఉన్నారు. వారు మాంసం తినడం తప్పు అని తెలుసుకున్నా సరే, ఎన్నో జీవులని చంపి ఫంక్షన్లు, వేడుకలు చేస్తారు

ఆ భగవంతుడు ఎంతో కరుణామయుడు, దయామయుడు కాబట్టి పురాణాల ద్వారా, ఇతిహాసాల ద్వారా ధర్మం ఏమిటో, సద్గురువుల ద్వారా మనకు బోధించారు.

అంతేకాదు సత్యం అంటే ఏమిటి? అసత్యం అంటే ఏమిటి? ఈ సత్యాన్ని నువ్వు చేరుకోవాలి అంటే ధర్మపరమైన జీవితం జీవించాలి, అధర్మపరమైన జీవితం పొరపాటున కూడా జీవించకూడదు అని గురువులు హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ మీరు పెడచెవిన పెడితే దుఃఖాన్ని అనుభవిస్తారు

కాని పాత సంస్కారాలు, పాత వాసనలు మూలాన అధర్మంగా ఉండవచ్చు, కానీ ఆ భగవంతుడు ప్రకృతి ద్వారా ఎన్నో అవకాశాలు ఇస్తాడు. అప్పటికీ నీలో మార్పు లేకపోతే శిక్ష పడక తప్పదు.

మీరు ఎదుటి వాడికి చెప్పే ప్రతీది ముందు మీరు ఆచరించాలి. మీరు అధర్మంగాఉంటే దైవానికి దూరం అవుతారు, దైవానికి దూరం అవ్వటం అంటే ఎన్నాళ్ళు సాధన చేసినా, ఆత్మ కోసం ఎంత పరితపించినా మీరు ఆత్మ

శక్తి పెంచుకోలేరు.

ఒక తప్పు చేసి ధ్యానంలో కూర్చుంటే పదే పదే అదే గుర్తుకు వస్తుంది. ఎందుకు చేసావు? ఎందుకు చేసావు? అని ఆత్మఘోష వినపడుతుంది. వాడు కూడా ఆత్మేగా, వాడు భగవంతుడేగా, శరీరం ధరించి సాధన కోసం వచ్చాడు, వాడికి ఎందుకు అన్యాయం చేశావు? వాటిని ఎందుకు బాధపెట్టావు? అనే ఆత్మ ఘోష ఉంటుంది.

అందుకే ఎప్పుడు కూడా ధర్మాన్ని ప్రేమించేవాడు, ధర్మాన్ని ఆచరించేవాడు, ధర్మవంతమైన జీవితం గడిపేవాడు దైవానికి దగ్గర అవుతాడు. ఇక్కడ మనం గమనించవలసింది ఏమిటి అంటే అధర్మపరమైన జీవితం జీవించేవాడికి ధర్మం వల్ల వచ్చే లాభాలు ఏవి రావు. అందుకే అధర్మ జీవితం అంటే కష్టాల జీవితం, రోగాల జీవితం, బాధల జీవితం, అశాంతి జీవితం.

ఇలాంటి వాళ్ళు తాత్కాలికంగా కొంత లాభం పొందొచ్చు కానీ అది శాశ్వతం కాదు. మరి ఎందుకు ఇలా అధర్మంగా జీవిస్తారు అంటే

1) మితిమీరిన మమకారం

2) మితిమీరిన అహంకారం

3) పగ ప్రతీకారం

4) దుష్టులతో సాంగత్యం

5) మితిమీరిన కామం.

ఈ ఐదు కారణాల వలన మనసు అశుద్ధం అవుతుంది, మనసు అశుద్ధం అయినప్పుడు అధర్మంగా జీవిస్తారు.

ఒక్కొక్క దాని గురించి ఉదాహరణలతో వివరించుకుందాం:

**1) మితి మీరిన మమకారం:** ధృతరాష్ట్రుడు తన పిల్లలైన కౌరవుల మీద మమకారంతో ఎన్నో తప్పులు చేశాడు. మరి రాజ్యం తనది కాదు, కానీ పిల్లల మీద మమకారం నా పిల్లలే బాగుండాలి, నా పిల్లలే చక్రవర్తులు కావాలి,

సార్వభౌములు కావాలి అనే ఒక స్వార్థంతో అధర్మంగా జీవించాడు. ధర్మం తెలుసు కానీ ప్రక్కవాడి మాట వినలేదు, విదురుడు చెప్తూనే ఉన్నాడు "నువ్వు చేస్తున్నది తప్పు అన్నయ్య, తప్పు చేస్తున్నావు" అని, కానీ విదురుడి మాట పెడచెవిన పెట్టి పిల్లల మీద మమకారంతో ఎన్ని తప్పులు చేశాడు? మరి పాండవులని ఎన్ని కష్టాలు పెట్టాడు దుర్యోధనుడు. అంటే రాజుగా తాను ఆజ్ఞ ఇవ్వ బట్టే కదా? మరి ఇది పిల్లల మీద ఉన్న మమకారంతో, ఏ పిల్లల కోసం అయితే అధర్మం చేశాడో, 100 మందిని కన్నా ఒక్కడు కూడా మిగలలేదు.

అంటే ప్రకృతి గమనించింది, తప్పుల మీద తప్పులు చేసుకుంటూ పోతే ప్రకృతి వేసే శిక్ష ఎవరికైనా తప్పదు. చూడండి ఒక తప్పు చేస్తే దొరకనప్పుడు తప్పులు చేసుకుంటూ పోతే వాడి జీవితం తప్పుడు జీవితం అవుతుంది.

**2) మితిమీరిన అహంకారం:** మితిమీరిన అహంకారంతో దుర్యోధనుడు నాశనం అయ్యాడు. మరి చూడండి నా తండ్రి చక్రవర్తి, నేనేం చేసినా చెల్లుతుంది, నేను యువరాజును, చక్రవర్తి కుమారుడిని కాబట్టి నా మాటే శాసనం అని పాండవుల మీద ఈర్ష్య చేత సూది మొన మోపినంత స్థలం కూడా ఇవ్వనన్నాడు. ఎంతో అధర్మంగా మాయాజూదం ఆడడమే కాదు, సాటి వాళ్ళని చంపడం ఎంత క్రూరత్వం? లక్క ఇంట్లో పెట్టి చంపాలనుకున్నాడు, భీముడికి చిన్నప్పుడే విషా హారం పెట్టాడు, మరి ఇన్ని అధర్మపరమైన పనులు చేసి పాండవులని బాధ పెట్టి, చిట్ట చివరికి సూది మొన మోపినంత స్థలం కూడా వాళ్ళకి ఇవ్వనని అహంకరించాడు. మరి తను భూమిమీద ఉన్నాడా? సూది మొన మోపినంత స్థలం పరిపాలించడానికి ప్రాణాలతోనే లేదు. ఇవన్నీ తెలుసు కోవాల్సిన విషయాలు. అధర్మపరమైన జీవితం జీవించినవారు అర్థాంతరంగా ఎలా మరణించారు అన్నది తెలుసుకోవాలి.

**3) పగ ప్రతీకారం:** పగ, ప్రతీకారంతో శకుని రగిలిపోయాడు. ఎందుకు అంటే గాంధారి విషయంలో గాంధారికి వైధవ్యం ఉందని అరటి చెట్టుతో పెళ్లి చేసి ఆ చెట్టుని నరికి గాంధారిని ధృతరాష్ట్రుడికి ఇచ్చారు. ఇది దుర్యోధనుడు అవమానంగా భావిస్తాడు, ఒక విధవరాలిని నా తండ్రికి కట్టబెట్టారు అని తాతగారిని, మేనమామలను అందరినీ జైల్లో వేస్తాడు. వారికి ఆహారం రోజుకి 100 మెతుకులు పంపిస్తే ఆ అన్నం మెతుకులు శకుని ఒక్కడే తిని బ్రతికి బయటకు వచ్చాడు.

కౌరవులైన దుర్యోధనుడి వంశం కూడా నిలవకూడదని శకుని బంధుత్వం ఉపయోగించుకొని దుర్యోధనుడి ప్రక్కనే ఉంటూ, దుర్యోధనుడికి ఎక్కేసి యుద్ధానికి పురిగొల్పి, ఆ యుద్ధంలో కౌరవులంతా నాశనం అయ్యేటట్టు చేశాడు. పగ అంటే తన తల్లిదండ్రులను, సోదరులను దుర్యోధనుడు చంపించాడు అని శకుని పగబట్టి, దానికి ప్రతీకారం తీర్చుకోవాలి అనుకుని శకుని కౌరవ వంశాన్ని నాశనం చేశాడు. పోనీ తనేమన్నా బ్రతికి ఉన్నాడా? తాను నాశనం అయ్యాడు.

**4) దుష్టులతో సాంగత్యం :** మీరు మంచిగా ఉన్నా దుష్టులు పదే పదే చెప్పిన చెడు మాటలే మీ బుర్రకు ఎక్కుతూ ఉంటాయి. అప్పుడు మీరు కూడా తప్పుడు మార్గంలో జీవిస్తారు. తప్పుడు వాళ్ళతో స్నేహం చేస్తే,తప్పుడు ఆలోచనలు వచ్చినట్టే. అందుకే ఎప్పుడు సజ్జనులతో సాంగత్యం చేయాలి కానీ దుష్టులతో సాంగత్యం చేయకూడదు అని పెద్దలు చెప్తారు. అలా దుష్టులతో సాంగత్యం చేసి కర్ణుడు నాశనం అయ్యాడు. మరి కర్ణుడు చూడండి అర్జునుడి కంటే కూడా చాలా తెలివైనవాడు, విలువిద్యలో అర్జునుడు లాంటి సమానమైన విద్య ఉంది. కానీ దుర్యోధనుడు లాంటి దుష్టులతో సాంగత్యం వల్ల, వాళ్ళు అధర్మం చేస్తున్నా ప్రోత్సహించాడే కానీ వద్దు అని చెప్ప లేకపోయాడు.

సూర్య భగవానుడి శక్తితో పుట్టాడు కర్ణుడు, కర్ణుడు మరణించేటప్పుడు శ్రీ కృష్ణుని అడిగాడట , “నేను అందరికీ దానాలు చేసాను,దాన కర్ణుడు అని బిరుదును కూడా పొందాను. ఆఖరికి కవచ కుండలాలు కూడా దానం చేశాను. అడిగిన వాళ్ళకి లేదనకుండా ఇచ్చి ఎంతో పుణ్యం చేశాను, పరశురాముడు లాంటి వాళ్ళ దగ్గర విలువిద్య నేర్చుకున్నాను, ఎన్నో అస్త్రాలు సంపాదించాను, కానీ నేను అర్జునుడి చేతిలో ఓడిపోవడానికి కారణం ఏమిటి? ఇలా నేను నేల కూలిపోవడానికి కారణం ఏమిటి? ఇన్ని శాపాలు భరించడానికి కారణం ఏమిటి?” అని శ్రీ కృష్ణుడిని అడిగాడు.

అప్పుడు శ్రీ కృష్ణుడు నువ్వు చేసిన ఒకే ఒక్క పొరపాటు దుష్టులతో సాంగత్యం చేశావు, అధర్మం ప్రక్కన వున్నావు. నీలాంటి గొప్పవాడు ప్రక్కన ఉన్నాడని వాళ్ళు మితిమీరి పాపాలు చేశారు, అందుకే నువ్వు ఎన్ని దానాలు చేసినా, ఎంత పుణ్యం సంపాదించినా, దుష్టులతో సాంగత్యం చేసి అధర్మం ప్రక్కన వున్న మూలాన నువ్వు అర్జునుడి చేతిలో ఓడిపోవాల్సి వచ్చింది, ఇంతమంది శాపానికి గురి కావలసి వచ్చింది అని కృష్ణుడు చెప్పాడు.

మరి దీని నుంచి నేర్చుకోవలసింది అధర్మంగా ప్రవర్తించకూడదు. అధర్మంగా ప్రవర్తించే వాళ్ళ ప్రక్కన ఉండకూడదు. దుర్యోధనుడు మిత్రుడని, వాడేదో తనకు సాయం చేశాడని, అధర్మాన్ని ప్రోత్సహిస్తే కర్ణుడిలాగే మరణం పొందవలసి వస్తుంది.

**5) మితిమీరిన కామం:** మితిమీరిన కామం అంటే శారీరక పరమైన కామం అవ్వచ్చు, మానసిక పరమైన కామం అవ్వచ్చు. నేడు భూమిమీద అందరికీ మానసిక పరమైన కామమే ఎక్కువ అంటే అన్ని అనుభవించాలని, గొప్పగా ఉండాలని, అందరూ నన్ను పొగడాలి, అధర్మంగా అయినా సరే, అన్యాయంగా అయినా సరే డబ్బు సంపాదించాలని, ప్రక్క వాడిది కొట్టయినా నేను సుఖంగా ఉండాలి అని అనుకుంటున్నారు.

మరి రావణాసురుడు ఎంత గొప్ప జ్ఞాని, కానీ తన బలహీనతను మార్చుకోవాలి అనే ఎరుక లేకుండా దైవం కావలసినోడు రాక్షసుడిగా మిగిలి పోయాడు. మరి అధర్మంగా ఉంటే ముందు తరాల వాళ్ళు ఎలా నాశన మయ్యారు అన్నది మీరు తెలుసుకోవాలి. దైవంలా కావలసిన వాళ్ళు కూడా, అధర్మం ప్రక్కన ఉంటే, అధర్మాన్ని ఆచరిస్తే, అధర్మాన్ని ప్రోత్సహిస్తే ఎలా నాశనమయ్యారో మనం తెలుసుకున్నాం.

అధర్మం నిప్పు లాంటిది, నీ ఇంట్లో వున్న నిన్ను కాలుస్తుంది, నీ ప్రక్క ఇల్లుని కూడా కాలుస్తుంది. అది బడబాగ్ని లాంటిది అంటే నీళ్ళల్లో ఉంటుంది, బడబాగ్ని పైకి చల్లదనం ఉంటుంది, లోన ఆగ్ని ఉంటుంది. అలాగే మానవులంతా చూడటానికి పైకి ఒకలాగే ఉంటారు. చాలా సౌమ్యంగా, చాలా అమాయకంగా ఉంటారు. కాని వాడి అంతరం ఎంత కలుషితమైతే, ఎంత అపరిశుద్ధమైతే వాడి ప్రక్కవాడిని కూడా నాశనం చేస్తూ ఉంటాడు. వాడు నాశనం అయిపోతే నష్టం లేదు, అది వాడికి నష్టం, కానీ వాడివల్ల సమాజం నాశనం అవుతుంది.

ఇప్పుడు చూడండి కౌరవ పాండవ యుద్ధంలో ఎంతమంది మరణించాల్సి వచ్చింది. అది దుర్యోధనుడి నిర్ణయం వల్ల ఇంత దారుణం జరిగింది. ఎవరి చరిత్రలు తీసుకున్నా అధర్మ పరులు ఎప్పుడూ కూడా శాశ్వత్వంగా భూమిమీద సుఖపడినట్టు లేదు. అందుకే అధర్మం తాత్కాలికంగా సంతోషాన్ని ఇవ్వచ్చు కానీ చివరకు శాశ్వతమైన దుఃఖంలో ఉంటారు, శాశ్వతంగా భగవంతుడికి దూరమైపోతారు అని తెలుసుకుంటే ఎవ్వరు కూడా అధర్మపరమైన జీవితం జీవించడానికి ఇష్టపడరు, కష్టమైనా ధర్మం వైపు ఉంటారు. మహాభారతంలో భగవంతుడు ధర్మం వైపు ఉన్నాడు, పాండవులను అడుగడు గునా కాపాడుతూనే ఉన్నాడు.

కానీ కౌరవులు తాత్కాలిక భోగం, తాత్కాలిక సుఖం అనుభవించారు.

ఎంతసేపూ పాండవులను ఎలా నాశనం చేయాలని ఆలోచిస్తూ సరిగ్గా నిద్ర లేకుండా ఉన్నారు. కానీ పాండవులు అడవుల్లో ఉన్న ప్రశాంతంగా జీవించారు, కారణం దైవం ప్రక్కనే ఉన్నాడు కాబట్టి.

మీరు కూడా ధర్మ మార్గంలో నడిచినప్పుడు, ఆత్మ అనే దైవం మీ శరీరంలోనే ఉంది కదా? నేను ఎందుకు భయపడాలి? నేను భగవంతుడితోనే ఉన్నాను, నాలోనే భగవంతుడు ఉన్నాడు అని అనుకుంటే ఏ తప్పు చేసినా తెలుస్తుంది. ఈ ఆత్మ నా శరీరంలో ఉన్నప్పుడు నా ప్రవర్తన అంతా ఆయనకు తెలియకుండా ఉండదు, నా ఆలోచనలు తెలియకుండా ఉండవు, అందుచేత నేను అధర్మంగా జీవించకూడదు అనుకుంటూ ఎప్పుడూ ధర్మంగానే ఉండాలి.

జీవుడిగా వచ్చిన నేను దేవుడిగా ఎదగాలి అంటే అధర్మాన్ని విడిచి పెట్టి, అధర్మపరమైన ఆలోచనలు విడిచిపెట్టి, అధర్మపరమైన చేతలను విడిచిపెట్టి నేను ధర్మంగా జీవించినప్పుడే దైవంగా ఎదగగలను అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన విషయం. అందుకే బుద్ధ భగవానుడు ధర్మం గురించి, అధర్మం గురించి అంత వివరంగా మనకి చెప్పడం జరిగింది. అలాగే పత్రిగారు కూడా పాపాలు చేయొద్దు అని పాపం గురించి, కర్మ సిద్ధాంతం గురించి మనకి నేర్పారు.

కాబట్టి తెలియక చేయొచ్చు కానీ, తెలిసాక మీ ప్రవర్తన సరిదిద్దుకోకపోతే మీ దుఃఖానికి కారణం మీరే అవుతారు. మీరు ఈ జన్మలోనే కాదు. మరణించాక కూడా శిక్షలు అనుభవించాలి. అంటే తరువాత జన్మలు నీచ జన్మలు వస్తాయి. బాధాకరమైన జీవితాన్ని అనుభవించడం ఎందుకు? ధర్మం తెలుసుకుని ధర్మవంతమైన జీవితం జీవించి ధ్యానం చేసి దైవంగా మారండి.

# ధర్మాన్ని ఆచరించాలంటే?

ధర్మం అంటే ఏమిటి? ధర్మాన్ని ఎలా ఆచరిస్తారు? ఆచరించే వాళ్ళ జీవన విధానం ఎలా ఉంటుంది? అధర్మ పరంగా జీవించేవారు ఎలా ఉంటారు? వాళ్ళ మనస్తత్వాలు ఎలా ఉంటాయి? వాళ్ళ జీవన విధానం ఎలా ఉంటుంది? అనే విషయాలు మనం తెలుసుకున్నాం. ధ్యానం బాగా కుదరాలి, జ్ఞానం పెరగాలి అంటే ఒక జ్ఞాని తన జీవితంలో ఈ విషయాలన్ని తెలుసుకోవడం అవసరం.

ధర్మాన్ని ఆచరించాలి అంటే ముఖ్యంగా మన జీవితంలో నీతి, నిజాయితీ అనే ఈ రెండు ప్రముఖ పాత్ర వహిస్తాయి. అందరూ ధర్మాన్ని ఆచరించాలి అని చెబుతుంటారు కానీ జీవితంలో నీతి నిజాయితీ అనే రెండు ఉంటేనే ధర్మాన్ని చక్కగా ఆచరిస్తారు.

మీరు జీవితంలో ఎంత నీతివంతంగా వుంటారో? ఎంత నిజాయితీగా ఉంటారో? ధర్మాన్ని అంత చక్కగా ఆచరిస్తారు. అప్పుడు మీకు ధ్యానం బాగా కుదురుతుంది, దైవానికి దగ్గర అవుతారు.

మరి నీతి అంటే ఏమిటి? నిజాయితీ అంటే ఏమిటి? అనేది తెలుసుకుందాం. పూర్వకాలంలో నీతిగా, నిజాయితీగా బ్రతికే వారిని గొప్ప శీలవంతుడు లేక శీలవంతురాలు అనేవారు. కానీ రాను రాను శీలము అనేది ఆడ వాళ్లకు పరిమితం చేశారు, శీలము అంటే క్యారెక్టర్ కాదు. నీతిగా, నిజాయితీగా బ్రతికే వారి గురించి చెప్పేటప్పుడు శీలము అనే పదం వాడతారు.

మరి నీతిగా బ్రతకడానికి ఎలా ఉండాలి? అన్న దానికి పూర్వకాలంలో కొన్ని నియమాలు, నిబంధనలు పెట్టారు. మరి అలాంటి జీవితమే నీతివంతమైన జీవితం అంటే శీలవంతమైన జీవితం అని చెప్పడం జరిగింది.

ఆ నియమాలు, నిబంధనలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం:

1) ఏ జీవికి హాని కలిగించకూడదు.

2) దొంగతనం చేయకూడదు.

3) వ్యభిచారం చేయకూడదు.

4) అబద్ధం ఆడకూడదు.

పూర్వం గురుకుల విద్య ఉండేది కాబట్టి గురువులు శిష్యులకు ఈ నాలుగు విషయాలు పదే పదే చెబుతూ వాళ్ళని ప్రోత్సహిస్తూ సరైన జీవిత విధానం నేర్పించేవారు. అంటే నీతివంతంగా జీవించడానికి ఈ నాలుగు విషయాలు పాటించటం ముఖ్యం.

**1) ఏ జీవికి హాని కలిగించకూడదు:**

నీతి అంటే సంఘ నీతి. మీరు ఈ సంఘంలో ఉన్నప్పుడు ప్రక్క వారిని ప్రేమిస్తే చాలు అనుకుంటూ ఒక పరిమిత జ్ఞానంలో ఉంటున్నారు. కానీ తోటి మానవులే కాదు ప్రపంచంలో ఉన్న సర్వ జీవులను ప్రేమించాలి అనేది సంఘ నీతి.

ఒక మానవుడి యొక్క ధర్మం ఏమిటి అంటే తాను ఎవరు? తాను ఎందుకు ఈ భూమ్మీదకి వచ్చాడు? అని తెలుసుకుంటే తాను ఆత్మని, సర్వ జీవులు కూడా ఆత్మ స్వరూపులే అని తెలుసుకొని ఏ జీవినీ హింసించడు, ఏ జీవిని హింసించినా తనను తానే హింసించుకున్నట్లే అని తెలుసుకుంటాడు.

మరి మాంసాహారం ఎందుకు తింటున్నారు అంటే తల్లిదండ్రులు అలవాటు చేయడం వల్ల, అజ్ఞానంలో ఉండటం వల్ల, సత్యం తెలియక జీవులను హింసిస్తున్నారు. అజ్ఞానంలో ఉన్న వారికి ఏ జీవినీ హింసించకూడదు అని తెలియదు. జీవహింస మహాపాపం అని తెలుసుకుంటున్నారు అయినా మాంసం మాన లేకపోతున్నారు అంటే వాళ్ళ మనసుల్లో ఇంకా చెడు భావాలు, క్రూరత్వం, దురాలోచనలు పోలేదు అని అర్థం చేసుకోవచ్చు.

మీలో జాలి, దయ, కరుణ, ప్రేమ అనేవి ఉంటే చిన్న జీవిని కూడా

చంపలేరు. చూడండి మీ చేతికి ఒక పిన్నీసు కానీ, ఒక సూది, గుచ్చుకున్నా లేక కాలి కింద ఒక రాయి తగిలినా, పోనీ యాక్సిడెంట్లో కాలుకు దెబ్బ తగిలినా ఎంత విలవిలలాడిపోతారు. అమ్మో దెబ్బ తగిలింది, అమ్మో రక్తం వచ్చేసింది అంటారు. అలాగే మీ బిడ్డకి చిన్న బాధ కలిగినా, ఏదైనా గీసుకుపోయినా ఎంతో బాధపడతారు. కానీ ఒక కోడిని పెంచి పోషించి చంపుతున్నారు అంటే మీ మనసులో జాలి, దయ లేదు. ఎదుటివారు ఏమైపోయినా నేను బాగుండాలి, నేను సుఖంగా ఉండాలి, నా ఇష్టం వచ్చినట్టు నేను ఉండాలి అని అనుకుంటున్నారు. కానీ సృష్టిలో అజ్ఞాని తప్పు చేస్తే చిన్న శిక్ష, జ్ఞానం పొందాక తప్పు చేస్తే పెద్ద శిక్ష పడుతుంది.

మరి గురువుల దగ్గరికి వచ్చి పాపం చేయడం, జీవహింస చేయడం ఎంత తప్పొ తెలుసుకున్నారు. కానీ ఇంకా మీలో చెడు భావాలు, చెడు ఆలోచనలు పోకపోతే మిమ్మల్ని ఆ భగవంతుడు మెచ్చేది ఎప్పుడు? మీరు మోక్షం పొందేది ఎప్పుడు?

మీరు ఆత్మని మధ్య పెట్టి మనో స్థితిలో తప్పులు చేస్తూ పోతే మీకు శిక్ష తప్పదు. అందుకే ఒక జీవిని చంపుతున్నప్పుడు మీరు చూస్తూ ఉన్నా తప్పే, చెప్పకపోవడం తప్పు అంటే ఏ మూలో ఇంకా క్రూరత్వం ఉంది, దయ లేదు, దురాలోచనలతో ఉన్నారు అని అర్థం చేసుకోవచ్చు.

అందుకని పూర్వం గురువులు ఏ జీవినీ నీ చేతల వల్ల కానీ మాటల వల్ల కానీ బాధ కలిగించకూడదు అని చెప్పేవారు. ఎందుకు ఈ మాట చెప్పారు అంటే కొన్ని కులాలలో పుట్టినవారు మాంసాహారం తీసుకోరు, కాబట్టి మాటల వల్ల కానీ, చేతల వల్ల కానీ మరి నువ్వు ఏ జీవిని బాధ పెట్టొద్దు అని చెప్పారు.

**2) దొంగతనం చేయకూడదు:**

దొంగతనం చేయకూడదు, ఎందుకంటే ఆ భగవంతుడు మనకు ఈ జన్మలో ఎంత ప్రాప్తమో అంత ఇచ్చాడు. మరి దొంగతనం చేయడం వల్ల

ఆ భగవంతుడి ఆజ్ఞను ఉల్లంఘించినట్టే. నీకు ఇచ్చిన దానితో తృప్తి లేకుండా ప్రక్కవాడిని దోచుకుంటున్నావు అంటే నువ్వు ఆ భగవంతుడు నిర్ణయాన్ని అంటే ఆజ్ఞను ఉల్లంఘించినట్టే.

ఈ భూమ్మీద దొంగతనం చేసిన వారికీ దానికి తగిన శిక్ష వేసి జైల్లో పెడతారు, వాడు ఆ శిక్ష నుండి తప్పించుకోవాలని చూస్తే మరల వాడిని పట్టుకొని ఆ పడిన శిక్షకు రెట్టింపు శిక్ష వేస్తారు. అలానే ఇక్కడ కూడా ఆ భగవంతుడు ఇచ్చిన దానికి సంతృప్తిపడక అత్యాశతో ప్రక్కవాడిని దోచుకోవాలని చూసినా, అడ్డదారులు తొక్కి దొంగతనం చేసినా ఆ భగవంతుడు కూడా దానికి తగిన శిక్ష వేస్తాడు.

ఇంకా నీ మనసులో ఎంత దురాలోచన ఉంటే ఇతరుల సొమ్ము దొంగతనం చేస్తావు అంటే నేను మోసం చేసినా వాళ్ళు తెలుసుకోలేరు అనే అజ్ఞానంలో నువ్వు ఉన్నావు. దొంగతనం ఎంత పాపము, మరలా ఒక జన్మ తీసుకుని దాని ఫలితం అనుభవించాలి. ఎందుకు అంటే మీకు కావాల్సినది, మీకు రావల్సింది మీ పుణ్యం ఎంత ఉందో అంతా మీకు ఇస్తూనే ఉన్నాడు.

కానీ మీలో అత్యాశ అనే గుణం ఉన్న మూలాన, ఆ దురాలోచన వచ్చి దొంగతనానికి పాల్పడుతున్నారు, అంటే కర్మలు పెంచుకుంటున్నారు. మరి మానవ జన్మ తీసుకున్నదే కర్మలు దగ్ధం చేసుకోవడానికి. ప్రారబ్ధ కర్మలు అనుభవిస్తూ, సంచిత కర్మలన్నిటినీ దగ్ధం చేసుకుని, ఆగామి కర్మలు చేయకుండా ఉండాలి. అంటే ఈ జన్మలో చేసే కర్మలన్నీ ఆగామి కర్మలు అవి పాపమైనా, పుణ్యమైనా అవి చేయకుండా ఆగలేకపోతున్నారు అంటే మీలో ఎంత దురాశ ఉందో అర్థమవుతుంది.

**3) వ్యభిచారం చేయకూడదు:**

మరి అలాగే వ్యభిచారం చేయకూడదు అని చెప్పడం జరిగింది. అంటే ధర్మాన్ని ఆచరించడంలో అది కూడా ముఖ్య పాత్రే. మరి శ్రీరాముడి జీవితం ధర్మము అని ఎందుకు అన్నారు అంటే ఒకే భార్య, ఒకే మాట అనే

పద్ధతిని ఆయన పాటించాడు.

మరి పెళ్లి నాడు ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ, నాతిచరామి" అని ప్రమాణం చేస్తారు. అంటే ఈ నాలుగు విషయాల్లోని నిన్ను వదిలి పెట్టను,

**ధర్మేచ:** ధర్మ పరమైన కార్యక్రమాలు చేసినప్పుడు నీ తోటే కలిపి చేస్తాను.

**అర్థేచ:** నేను ఎంత సంపాదించినా నీతో కలిపే నేను ఖర్చు పెడతాను.

**కామేచ:** నీతో తప్పించి శరీర సుఖం ఎవరి తోటి పొందను.

**మోక్షేచ:** మోక్షంలో కూడా నీ తోటే కలిపి నేను ప్రయత్నిస్తాను అని పెళ్ళినాడు సర్వ దేవతలు సాక్షిగా ప్రమాణం చేస్తారు.

ఈ కలియుగంలో అర్థాలు తెలియక మనసు చంచలమై ఎన్నో తప్పుడు పనులు ప్రస్తుత సమాజంలో జరిగిపోతున్నాయి.

నీలో మితిమీరిన శారీరక కామం ఉన్నప్పుడు నువ్వు వ్యభిచారం చేస్తావు. ఉదాహరణగా రావణాసురుడి గురించి ఎన్నో సార్లు చెప్పుకున్నాం. మరి ఇలా ఎందుకు చేస్తున్నారు అంటే మనస్సు యొక్క చంచల స్థితి, నీలో ఉన్న అహంకారం, నీలో ఉన్న రాగద్వేషాలు, నీలో ఉన్న అత్యాశ, నీలో ఉన్న కోరికలు.

### 4) అబద్ధం ఆడకూడదు:

అబద్ధం చెప్పకూడదు, మరి అబద్ధం చెబితే ఏమవుతుంది అంటే కర్మలు పెరుగుతాయి. భగవంతుడు విగ్రహంలో ఉన్నాడు కాబట్టి ఆయన వినడు అని అనుకుంటారు. కానీ ఆయన సర్వాంతర్యామి అని తెలియక అబద్ధాలు ఆడతారు.

మరి నీలో అత్యంత అహంకారం ఉంటే నువ్వు అబద్ధాలు చెప్తావు అంటే నేను ఏం చెప్పినా ఎదుటి వాడు నమ్మేస్తున్నాడు, వినేస్తున్నాడు అని అనుకుంటావు. కానీ ఎదుటి వాడిని మభ్య పెట్టొచ్చు కానీ నీ అబద్ధాల అన్నీ పరమాత్మకు తెలుస్తూనే ఉంటాయి. నీవు అబద్ధం ఆడితే నీలో అహంకారం

ఉందని గుర్తుంచుకో. నీ మాటలలో గాని, నీ చేతలలో కాని నీతి నియమాలు లేకపోతే నువ్వు పాపాలు చేస్తావు, అధర్మంగా ప్రవర్తిస్తావు.

ఈ నాలుగు తప్పనిసరిగా మానవ జీవితంలో ఆచరించాల్సిన నీతి నియమాలు. నీతికి, నిజాయితీకి కట్టుబడి ఉండాలి. ఆ నాడు ఈ నాలుగు పాటిస్తేనే శీలము అని చెప్పేవారు, అది మగవాళ్ళు అవ్వనివ్వండి, ఆడవాళ్ళ అవ్వనివ్వండి.

కానీ రాను రాను ఈ మత్తు మందులు, మద్యానికి బానిసలై తప్పులు, పాపాలు చేయడం మొదలు పెట్టారు. ఈ పంచ శీలాలు అతిక్రమిస్తే నరకానికి వెళ్తారు అని చెప్పేవారు.

ఈ ఐదు పాటిస్తేనే నీతివంతమైన, నిజాయితీ జీవితం అవుతుంది అని చెప్తూ ఇలాంటి వారే ధర్మాన్ని ఆచరించగలరు. ధర్మాన్ని ఆచరించే వారికే ధ్యానం కుదురుతుంది, ధ్యానం కుదిరిన వాడే దైవానికి దగ్గర అవుతాడు, దైవాన్ని తెలుసుకుంటాడు అని చెప్పేవారు.

మరి పూర్వకాలంలో ఇలా అందరిని మొదట్లో పాపం వదిలి పుణ్యం చేయించేవారు. తర్వాత ధ్యానం ఎందుకు అంటే భగవంతుడు ఎవరు అని తెలుసుకోవడానికి అని చెప్పేవారు.

ఈ పంచ శీలాలు పాటించినప్పుడు ధర్మవంతమైన జీవితం జీవిస్తావు, ధర్మవంతమైన జీవితం జీవించినప్పుడు ప్రకృతి నీకు భూమిమీద ఉండగానే ఎన్నో సమకూరుస్తుంది. మరి నీకు ఎన్ని సమకూరుస్తున్న భగవంతుని గురించి తెలుసుకుంటేనే మోక్షము అని చెప్పి ధ్యానంలోకి, జ్ఞానంలోకి ప్రజలను తీసుకు వెళ్ళే వారు నాటి యుగాల్లో.

కానీ ఇప్పుడు డబ్బు, పదవులు వెంట పడుతూ ఈ ఐదు మర్చి పోతున్నారు. ఈ ఐదు పాటిస్తేనే శీలవంతులు అవుతాము అనే విషయం చాలామంది దాదాపుగా మర్చిపోయారు. డబ్బు వెనకాల, పదవులు వెనకాల పడి సత్యాన్ని మర్చిపోయి, భగవంతుడు ఎవరో మర్చిపోయి, విగ్రహాల్లో మాత్రమే

భగవంతుడిని దర్శిస్తూ అదే సత్యమని నమ్ముతున్నారు.

ఇక్కడ గమనించండి ఎందుకు సత్యమని నమ్ముతున్నారంటే, వాళ్ళ జీవితం అంతా అధర్మ పరమైన జీవితమే కాబట్టి సత్యాన్ని వాళ్ళు తెలుసుకోలేరు, తెలుసుకోరు కూడా. ఎప్పుడైతే పంచ శీలాలు మర్చిపోయి డబ్బు వెనకాల పదవుల వెనకాల పడి తిరుగుతున్నారో అంటే నశించిపోయే వాటి వెనకాలే పడుతూ, నశించని శాశ్వతమైన, సత్యమైన ఆత్మ అనే భగవంతుని గురించి తెలుసుకోలేకపోతున్నారు.

ఇలాంటి వారిని చూసి ఈ మార్గంలోకి వచ్చిన వారు కూడా డబ్బు వెనకాల పడుతూ సంకల్పాలు పెట్టుకుంటే డబ్బు వస్తుందని సంకల్పాలు పెట్టుకొని ధ్యానం చేస్తున్నారు. కొంత మంది గురువులు చెప్పిన సంకల్పాల పిచ్చిలో పడి ఎదగలేక పోతున్నారు. గురువు జ్ఞానం చెప్పొచ్చు, సాధన చెప్పొచ్చు కానీ ఆచరించవలసిన శిష్యుడు చంచల మనస్కుడైతే, ఆ మనసుని శుద్ధం చేసుకోకపోతే, ఆ మనసు శూన్యం కాదు.

మనసు శుద్ధత్వం పొందితేనే బుద్ధత్వం వస్తుంది. శుద్ధత్వం పొందాలి అంటే ఈ సృష్టిలో ఉన్నవన్నీ అశాశ్వతం, శాశ్వతమైన వాడు ఆ సృష్టికర్త, ఆయనే సత్యం, ఆయన ఎక్కడో లేడు ఆత్మగా నా శరీరంలోనే ఉన్నాడు అనే పరమ సత్యాన్ని తెలుసుకోవాలి. కానీ ప్రస్తుతం చూసేదంతా సత్యమని నమ్ముతూ, చూడని ఆత్మ ఉందో లేదో అని అనుకుంటూ నశించిపోయే ప్రపంచ వెనకాలే పడుతున్నారు. కానీ నువ్వు ఎన్ని జన్మలు ఈ పదవుల కోసం, భోగాల కోసం సాధన చేస్తావో అన్ని జన్మలు దుఃఖంలో నుంచి, బాధలో నుంచి బయటపడలేవు.

మరి “ఇన్ని రోజుల నుంచి ధ్యానం చేస్తున్నాను, శాశ్వతమైనది ఆ భగవంతుడే, ఆ భగవంతుడే సత్యం అని తెలుసుకున్నా ఇంకా అనుకున్నది సాధించట్లేదు అంటే ఎక్కడో ధర్మాన్ని తప్పాను, ఎక్కడో నీతి నిజాయితీ లేకుండా

ఉన్నాను, లేదా పూర్వ జన్మల కర్మలు దగ్ధం అయ్యేంత తీవ్ర సాధన నేను చెయ్యట్లేదు, నాలో ఎక్కడో లోపం ఉంది" అని ఎవరికి వారు తెలుసుకొని విచారణ చేసుకోవాలి. మీరు అన్నీ తెలుసుకుంటున్నారు కానీ ఆచరించక పోవటమే మీలో ఉన్న పెద్ద లోపం.

మీ మనసు చంచలత్వంతో తప్పు చేసినా, దొంగతనం చేసినా, అబద్ధాలు ఆడినా నరులు చూడకపోయినా నారాయణుడు చూస్తున్నాడు అని, సర్వాంతర్యామి అయిన ఆయనకు తెలియనిది ఏమీ లేదు అని తెలుసుకోవాలి. నరుడిని మాయ చేయొచ్చు, కానీ పరమాత్మని మాయ చేయలేరు. అందుచేత దొంగతనం చేసినా, తప్పులు చేసినా భగవంతుడి కోర్టులో నీకు శిక్ష తప్పదు. ప్రకృతి ద్వారా భగవంతుడు నీకు శిక్ష వేస్తాడు. అంటే ఇంకా గత జన్మ సంస్కారాలు వదలలేదు అని అర్థం చేసుకోవచ్చు.

జీవహింస మహాపాపం అని తెలుసుకుంటున్నారు అయినా మాంసం తినడం మాన లేకపోతున్నారు అంటే వాళ్ళ మనసుల్లో ఇంకా చెడు భావనలు, క్రూరత్వం, దురాలోచనలు పోలేదు అని అర్థం చేసుకోవచ్చు.

మీరు తీవ్రంగా సాధన చేస్తూ ఉంటే మనసు చంచల స్థితి నుండి నిశ్చలస్థితికి, నిశ్చల స్థితి నుండి నిర్మలస్థితికి వస్తే మీరు ఎలాంటి తప్పులు, పాపాలు చేయరు. అలాగే ఆహార నియమాలు కఠినంగా పాటించాలి. తప్పులు, పాపాలు చేయకుండా ప్రపంచంలోని వాటి కోసం ఆశపడకుండా పరమాత్మ కోసమే ధ్యానం చేస్తే ఆ ప్రకృతి తల్లిలా కాపాడుతుంది.

కానీ ఇంకా కోరికలు, ఆశలతో ప్రపంచం వైపు తిరిగి అవి కావాలి, ఇవి కావాలి అని కోరుకుంటే నువ్వు ధ్యానం చేసినా, చేయకపోయినా ఒకటే. మనసు ఇంకా మురికిగా ఉంది అంటే సరైన ఆహారం తీసుకోవట్లేదు అని అర్థం. ఎక్కువ పాపాలు తమో గుణం, రజో గుణంలోనే చేస్తారు కాబట్టి ధర్మాన్ని ఆచరించాలంటే తమోగుణం, రజోగుణం వదలి శుద్ధసాత్విక స్థితికి వెళ్ళాలి.

నిర్గుణ స్థితి వచ్చింది అంటే అందరూ ఆత్మ స్వరూపులే ఎవరు గొప్ప కాదు, ఎవరూ పేదా కాదు అని ధర్మాన్ని ఆచరించగలరు.

మరి మీరు గమనిస్తే రాముడు కూడా తన పదహారేళ్ల వయసులో ప్రపంచంలో ఉన్న దుఃఖం చూసి దుఃఖించాడు, ఆ సమయంలో రాముడికి కర్మ సిద్ధాంతం తెలీదు, ఈ ఆత్మజ్ఞానం కూడా తెలీదు అందుకే దుఃఖించాడు. అప్పుడు గురువు గారైన వశిష్టుల వారు ఆత్మ జ్ఞానం అంతా బోధించినప్పుడు తన కర్తవ్యం ఏంటి? అని అర్థమైంది.

అది అర్థమయ్యాక తను రాజ పుత్రుడు కాబట్టి ప్రజలను రక్షించ వలసిన బాధ్యత, ప్రజల మాటకు విలువ ఇవ్వాల్సిన అవసరం ఉంది అని రాముడు తెలుసుకున్నాడు. మరి ధర్మం అంటే ఏమిటో తెలుసుకున్నాడు, సకల జీవులు ఆత్మ స్వరూపులే అని తెలుసుకొని అందరితో, అన్నిటితో స్నేహంగా ఉంటూ ముందుకు వెళ్లి తాను చేయాల్సిన కార్యం పూర్తి చేశాడు. ఈ విషయం మనకు వశిష్ఠామృతంలో చెప్పబడింది.

అందుకే పూర్వం మన పెద్దలు ఏం చెప్ప చెప్పేవారు అంటే భాగవతం చదివితే భగవంతుడి మీద భక్తి వస్తుంది, ఎందుకంటే అన్నిటిలోనూ నేనే అని ఆయన చెప్పడం జరిగింది. నేను సర్వాంతర్యామిని, నేను శాశ్వతుడిని అని భాగవతంలో చెప్పడం జరిగింది. మరి కర్మ యోగం తెలియాలి అంటే భగవద్గీత చదవాలి అని చెప్పారు. మరి జ్ఞానం తెలియాలి అంటే వశిష్ట గీత చదవాలి, రామాయణం చదివితే ధర్మం నేర్చుకుంటాము అని గురువులు, మహాత్ములు మనకి ఈ గ్రంథాలన్నిటినీ చదవమని చెప్పారు.

అంటే మనం ఎవరం? ఈ భూమి మీదకి ఎందుకు వచ్చాం? మానవ జన్మ ఎందుకు తీసుకున్నాం? అని తెలుసుకోవడానికి ఇవన్నీ చదవ మన్నారు.

ఈ పంచ శీలాలు పాటించిన వాడే నిజాయితీగా బతుకుతాడు, నీతిమంతుడిగా ఉంటాడు, అప్పుడే ధర్మాన్ని ఆచరించగలడు, ధర్మాన్ని

ఆచరించిన వాడికే ధ్యానం కుదురుతుంది, ధ్యానం కుదిరిన వాడికే జ్ఞానం పెరుగుతుంది, జ్ఞానం పెరిగినప్పుడే పరమాత్మ దర్శనం అవుతుంది, సర్వాత్మ భావన వస్తుంది. అప్పుడు మోక్షాన్ని పొందుతారు.

ఇంకొక ధర్మం కూడా ఉంది జ్ఞానులకు తాను జ్ఞానవంతుడు అవ్వడమే కాదు, ఈ భూమిమీద కొందరినైనా జ్ఞానవంతులుగా తయారు చేయడమే ఒక జ్ఞాని యొక్క చిట్ట చివర ధర్మం.

అందుకే మహాత్ములందరూ ఎంత జ్ఞానం సంపాదించినా ఈ భూమి మీదకు వచ్చి తన లాంటి వాళ్ళని కొంతమందినైనా తయారు చేయడానికి వాళ్ళ బోధ మొదలుపెట్టి అందరికీ అందించి, కొన్ని పుస్తకాల రూపంలో ఇచ్చి, ముందు తరాల వాళ్ళు కూడా తరించడానికి కృషి చేసి ఆనంద స్వరూపులుగా మిగిలిపోతారు.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

# ఆత్మ విద్య-బ్రహ్మ విద్య : శిష్యుడి యోగ్యత

ఎన్నో రోజులుగా మీరు సాధన చేస్తూ, ఆత్మ విద్య మరియు బ్రహ్మ విద్య నేర్చుకుంటున్నారు, మరి శిష్యుడు గురువు దగ్గర ఎలా ఉంటే ఆ విద్య బాగా అభ్యసించగలడో తెలుసుకుందాం.

"ఆత్మ గురించి అధ్యయనం చేసేది ఆత్మ విద్య", "పరబ్రహ్మ గురించి తెలుసుకునే పరావిద్యనే బ్రహ్మవిద్య" అంటారు. ఈ రెండు విద్యలు మీ జీవితంలో అత్యంత మహత్తరమైనవి. ఇవి కేవలం వినడానికి కాదు, అనుభవించడానికి, ఆచరించడానికి. ఈ విద్యలను నేర్చుకుంటున్నప్పుడు మీరు ఎలా ఉండాలో? ఎలా ఉంటే ఈ విద్య బాగా అభ్యాసం అవుతుందో అన్నది తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎందుకంటే పరబ్రహ్మ మీ శరీరంలోనే ఉన్నాడు, మిమ్మల్ని ఎప్పుడూ గమనిస్తుంటాడు అని అజ్ఞానంలో ఉన్న వాళ్ళకు అర్థం కాదు. కానీ సృష్టి అంతా పరబ్రహ్మ అన్న సత్యం మీకు తెలిస్తే, మీ మాటలు కానీ, మీ ప్రవర్తన కానీ, పరమాత్మకు తెలియకుండా ఉండవు. ఆయన అన్నింటినీ తెలుసు కోగలడు అన్నది కూడా తెలుసుకుంటారు.

ప్రాపంచిక విద్యలు అందరూ చెప్పగలరు కానీ ఆత్మ విద్య, బ్రహ్మ విద్య ఏ కొద్దిమంది సత్పురుషులు మాత్రమే చెప్పగలరు. అందుకే ఈ ఆత్మ విద్య, బ్రహ్మ విద్య నేర్పే గురువుల్ని సద్గురువులు అని మనం చెప్పుకుంటాం.

ఎందుకంటే సత్యంలో జీవించే వాళ్ళకు, సత్యాన్ని ప్రేమించే వాళ్ళకు మాత్రమే సత్యం అవగతం అవుతుంది. ఆ సద్గురువులు అందరికీ జ్ఞానం నేర్పుతారు కానీ కొంత మందే దాన్ని అవగాహన చేసుకొని ఆచరించ గలుగుతారు. అందుకే ఆ చెప్పే గురువుల మీద శిష్యుడికి భక్తి ఉండాలి, ఆ భక్తి ఉన్నప్పుడే ఆధ్యాత్మికత వంటబడుతుంది.

ఆత్మే దైవం కాబట్టి, దైవం గురించి నాకు చెప్పడానికి గురువు

వచ్చాడు, ఆ భగవంతుడే నా దగ్గరకు పంపించాడు, భగవంతుడి దూతగా భూమి మీదకు వచ్చి ఆ భగవంతుడు గురించి చెప్తున్నాడు అన్న భావం శిష్యుడిలో ఉండాలి, అప్పుడు మాత్రమే గురువు మాటలను నమ్మగలుగుతారు.

ఇప్పుడు చూడండి మీకు ఎవరైనా హెల్ప్ చేస్తే వారి మీద కృతజ్ఞత భావంతో ఉంటారు, మరి భగవంతుడు గురించి చెప్పడానికి వచ్చిన ఆ గురువు మీద ఎంతో శ్రద్ధ ఉంటే కానీ ఈ ఆధ్యాత్మికత మీకు వంట పట్టదు. గురువు మీద భక్తే ఆ భగవంతుడు మీద భక్తిగా మారుతుంది.

గురువు ఆత్మే దైవం అని ఒక్క ముక్కలో చెప్పారు అంటే లోతుల్లో ఆలోచిస్తే భగవంతుడు ఎక్కడో దేవాలయాల్లో, పూజా మందిరాల్లో ఉన్నాడు అనే అపోహ నుంచి బయట పడేయడానికే భగవంతుడు ఆ గురువు రూపంలో వచ్చి మీ అజ్ఞానాన్ని తొలగిస్తాడు. కాబట్టి ఆ గురువు భగవంతుడు రూపంలో వచ్చాడు అని ఆ గురువు మీద అచంచలమైన భక్తి ఉన్నప్పుడు ఆ మాటలు విశ్వసిస్తారు, నమ్ముతారు. అందుకే గురువు మీద మీకు భక్తి ఉన్నప్పుడు మాత్రమే ఆధ్యాత్మికంగా ఎదగగలరు.

ఎన్నో ప్రవచనాలు విన్నంత మాత్రాన జ్ఞానం పెరగదు. విన్న దాన్ని జీవితంలో ఆచరణలో పెట్టుకున్నప్పుడే జ్ఞానం పెరుగుతుంది. అదే వారు గురువుకి ఇచ్చే గురు దక్షిణ. గురువు ఆత్మే నువ్వు అన్నాడు, ఆ క్షణం నుంచి మీరు భగవంతుడులా ఉండడానికి ప్రయత్నించాలి. అంటే భగవంతుడులాగ అన్ని ఇవ్వగలిగే శక్తి లేకపోయినా, నా శక్తి ఉన్నంత వరకు ఇవ్వాలి అనే భావం మీలో వస్తుంది, ఇవ్వలేకపోయినా ఎవరికీ కష్టం కలిగించకూడదు.

అప్పుడు మాత్రమే భగవంతుడు మెచ్చుకునే శీలం మీకు అలవాటు అవుతుంది.

మీరు నేర్చుకోవాల్సింది ప్రపంచంలో ఎక్కువగా ఉండడం కాదు, గురువు చెప్పిన విషయాలు ఆచరణలో పెట్టడమే, భగవంతుడి దృష్టిలో

గొప్పతనమే నిజమైన ఆధ్యాత్మిక విజయం.

శిష్యుడికి యోగ్యత ఎప్పుడు అంటే శిక్షణ పొందడానికి అర్హత ఉన్నప్పుడే! అంటే గురువు చెప్పినవి ఆచరణలో పెట్టుకుంటే శిష్యుడిగా ఎదిగినట్టు. నా విషయానికి వస్తే నేను పత్రి గారి శిష్యురాలిని అనిపించుకోవాలి అనుకునేదాన్ని. నాకు ఆయన గురువులా కాదు, నేనే పత్రి గారికి తగిన శిష్యురాలని అనిపించుకోవాలి అనే పట్టుదల ఉండేది. అలాగే ప్రతి శిష్యుడు కూడా గురువు చెప్పింది ఆచరణలో పెట్టుకొని గురువుకు తగ్గ శిష్యుడు అనిపించుకోవాలి.

ఈ శిక్షణ నీకు నువ్వు ఇచ్చుకునేదే కానీ ఎవరు నిన్ను కూర్చోబెట్టి శిక్షణ ఇవ్వరు. విశ్వాసం లేని విద్య విశిష్టత లేనిది అన్నారు మహాత్ములు. నీకు గురువు మీద విశ్వాసం ఉన్నప్పుడే నువ్వు నేర్చుకున్న విద్య విశిష్టత పొందుతుంది. గురువు మాటలపై సందేహం ఉంటే సంపూర్ణ శరణా గతి సాధ్యం కాదు, అందుకే విశ్వాసం అత్యంత అవసరం.

దేవుడే లేడని వాదించే నాస్తికులకు ఆత్మ విద్య, బ్రహ్మ విద్య బోధించవద్దు అని మహాత్ములు చెప్పారు. అలా చేస్తే వారు మిమ్మల్ని హేళన చేస్తారు.

శ్రీ కృష్ణ భగవానుడు "బలహీనులకి హస్తగతమై నందువల్ల యోగము నశించిపోయింది" అని చెప్పారు. బలహీనులు పరిపాలకులైనప్పుడు, ఆధ్యాత్మికత అర్థం కాని వారు అధికారంలోకి వచ్చినప్పుడు యోగం నశించింది. యోగులను హింసించిన చరిత్ర కూడా ఉంది. మరి ఈ కలియుగంలో అలాంటి వాళ్ళ చేతుల్లో యోగమే నశించిపోయింది.

కాని ఈ కలియుగంలో పత్రి గారు భూమ్మీదకి వచ్చి నశించిపోయిన యోగవిద్యను మళ్ళీ ప్రకాశింప చేసారు. పత్రీజీ అందరూ ఆత్మేలే అన్న సత్యాన్ని మళ్లీ వెలుగులోకి తెచ్చారు. ఆయన ఎంతో మంది శిష్యులను తయారు చేసి

మనమంతా ఆత్మ స్వరూపులమే అని, మరిచిపోయిన సత్యాన్ని వెలుగెత్తి చాటాడు. అందుకే మీరు గురువు దగ్గర కి వెళ్ళినప్పుడు గురువు మీద భక్తి, ఆయన మాటల మీద విశ్వాసం ఉంచినప్పుడు ఈ విద్యని చాలా అద్భుతంగా నేర్చుకుంటారు.

శిష్యుడికి మొదట ఉండాల్సింది శ్రద్ధ. శ్రద్ధగా విని, పదే పదే మననం చేసినప్పుడే భగవంతుడు గురించి నిజమైన అవగాహన కలుగుతుంది. గురువు నువ్వు ఆత్మ స్వరూపానివి అన్నాడు అంటే 'అహం ఆత్మ' అని, ఆ తర్వాత 'తత్వమసి' అంటే అందరూ ఆత్మ స్వరూపులే! అంటే దేహాలన్నీ నశించేవే కానీ అంతర్యామి అయిన ఆ ఆత్మ నశించేది కాదు, సర్వం ఖల్విధం బ్రహ్మ అంటే సృష్టి అంతా బ్రహ్మ మయమే అని నేర్చుకుని, అవగాహన పొందినప్పుడు మీకు భగవంతుడి మీద భక్తి పెరుగుతుంది.

ఈ పంచభూతాల ద్వారా, ఈ ప్రకృతి ద్వారా మన జీవన విధానం సాఫీగా సాగడానికి ఎన్నో అద్భుతాలు సృష్టించి ఇచ్చాడు భగవంతుడు. ఇది తెలుసుకున్నప్పుడు మనకు భగవంతుడి మీద ఎంతో భక్తి కుదురుతుంది. చిన్న సాయం చేస్తేనే కృతజ్ఞత భావంతో ఉంటాం కదా! మరి అలాంటిది మనం కోరినా, కోరకపోయినా సృష్టిలో సమస్త జీవులు సుఖంగా బతకడానికి ఎన్నో సృష్టించి భూమిమీద పెట్టాడు ఆ భగవంతుడు.

మానవ జన్మలోనే పరమాత్మను తెలుసుకునే అవకాశం ఉంది. ఎన్నో జన్మల పుణ్యం వల్లే సద్గురువు లభిస్తాడు. ఆయన అజ్ఞాన నిద్ర నుంచి మనలను మేల్కొలుపుతాడు. చూడండి చాలా మంది సూర్యోదయం అయినప్పుడు లేచి పోతారు, అట్లాగే పూర్వం కూడా పెద్దలు బారడు పొద్దెక్కింది ఇంకా నిద్ర లేవవా? అని కూడా అడిగేవారు. అలానే మనం కూడా ఇన్ని జన్మలు అజ్ఞానం అనే నిద్రలోనే ఉన్నాం, కానీ పత్రిగారు వచ్చాక జ్ఞానం అనే సూర్యుడిని మన అందరి హృదయాల్లోనే వెలిగించారు.

ఎందుకంటే ఎన్నో జన్మల నుంచి అజ్ఞానంతో ఎన్నో కర్మలు చేసాము, అందుకే ఎంతగా జ్ఞానం పెంచుకుంటే అంతగా కర్మలు దగ్ధమవుతాయి. ఎందుకు అంటే ముందు మీ కర్మలను దగ్ధం చేసుకోవాలి, రెండు దేహం ఉండగానే దేహాన్ని సృష్టించిన వాడిని దర్శించుకోగలగాలి అని తెలుసుకోవాలి.

మరి ఇలా తెలుసుకున్న వాళ్ళ ప్రాపంచిక జీవన విధానం ఎలా ఉండాలి అంటే సత్ శీలము, అంటే భగవంతుడు మెచ్చే శీలము కలిగి ఉండాలి. మరి ఈ జ్ఞాన మార్గంలోకి వచ్చినవారు ఎప్పటికప్పుడు నేను తప్పు చేస్తున్నానా? అబద్ధం ఆడుతున్నానా? దొంగతనం చేస్తున్నానా? తెలిసో తెలియకో ఎవరిదైనా తీసుకుంటున్నానా? అని ఎప్పటికప్పుడు విచారణ చేసుకుంటూ ఉండాలి.

"ఈ ఆత్మ విద్య, బ్రహ్మ విద్య ఎవరైతే అధ్యయనం చేసి ఆచరణలో పెట్టుకొని, ప్రక్కవాడికి బోధిస్తారో వాళ్ళకు నేను విధేయుడనై ఉంటాను" అని శ్రీ కృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది.

ఉపనిషత్తుల్లో కూడా "నువ్వు ధర్మాన్ని ఆచరించగలిగితే ఆ ధర్మమే నిన్ను రక్షిస్తుంది" అని చెప్పబడింది. అంటే "ఈ మానవ జన్మ ఆత్మ విద్య, బ్రహ్మ విద్య నేర్చుకుని, ఆచరించి, ప్రక్క వాళ్ళ చేత ఆచరింప చేయడమే" ధర్మం అని చెప్పబడింది.

మీరందరూ కూడా ఈ మానవ జన్మని సార్థకత చేసుకుంటున్నారు, గురువు చెప్పినది ఆచరిస్తున్నారు, ప్రక్కవాడికి చెబుతున్నారు, భగవంతుడు మెచ్చేటట్లు ప్రవర్తిస్తున్నారు. ఇవన్ని చేసినవారు ఎప్పుడు ఆనంద స్థితిలోనే ఉంటారు.

మీ స్వరూపం ఆనందమే. నేను ఆత్మను అనుకున్నప్పుడు ఆనందం, నేను దేహాన్ని అనుకున్నప్పుడు దుఃఖం మొదలవుతుంది. మరి ఆనంద స్వరూపుడిగా భూమి మీదకు వచ్చి ఎందుకు ఆనందాన్ని అనుభవించలేక

పోతున్నారు అంటే దానికి కారణం  వాసనలు. వాసనలు అంటే 1. దేహ వాసన, 2. లోక వాసన, 3. శాస్త్ర వాసన.

**1) దేహవాసన:**

నేను దేహం అనుకుంటూ మధ్య మధ్యలో మాయకు వశం అవుతున్నారు. ఈ మాయ వల్లే ఆనంద స్వరూపమైన మీరు దుఃఖంలో కూరుకుపోతున్నారు. ఈ భూమిమీద భగవంతుడు సృష్టించిన మాయ మానవుడ్ని ఎంతగా దిగజారుస్తుంది అంటే ఈ విద్య నేర్చుకుంటూ పరమాత్మ వైపు పయనం అవుతున్నప్పుడు మధ్య మధ్యలో మిమ్మల్ని పరీక్షించడానికి మాయను పంపుతాడు. ఆ క్షణం మళ్ళీ మాయకు వశమై మీరు దేహము అనుకోగానే బంధాలన్నీ గుర్తొస్తాయి, బాధ్యతలన్నీ గుర్తొస్తాయి, మరలా దుఃఖంలో కూరుకుపోతారు.

**2) లోక వాసన:**

ఏ పని చేయాలన్నా లోకం ఏమనుకుంటుంది అని లోకుల కోసం ఆలోచిస్తారు. ఈ లోకంలో వాళ్ళందరినీ చూసి వాళ్ళు ఇలా సుఖపడుతున్నారు, వీళ్ళు అలా సుఖపడుతున్నారు, వాళ్ళకి మేడలు ఉన్నాయి, కార్లు ఉన్నాయి నాకు లేవు అని దుఃఖంలో కూరుకుపోతారు.

కానీ గురువుగారు నీ వాస్తవాన్ని నువ్వే సృష్టించుకుని వచ్చావు, అన్న మాట పదే పదే ఎరుకలో ఉన్నప్పుడు,  నీ బుద్ధి చంచలం అవ్వదు. నిజమే కదా! నేను ఈ భూమ్మీద ఎలా ఉండాలి? ఎలా బ్రతకాలని  పైనే నిర్ణయించుకుని వచ్చాను,  కాని లోకేశ్వరుడు దగ్గర ఒప్పుకొని వచ్చింది మర్చిపోతున్నాను, నేను జ్ఞానం పొందాలనుకున్నాను అని ఆ లోక వాసనను కూడా దాటగలగాలి.

**3) శాస్త్ర వాసన:**

ఎన్నో రకాల శాస్త్రాలు చదివి అన్నీ తెలిసిపోయాయి అని అనుకుంటారు. ఎంతవరకు శాస్త్రాలు నీకు ఉపయోగపడతాయి అంటే నీకు

ఆత్మవిద్య, బ్రహ్మ విద్య చెప్పే గురువు వచ్చే వరకు. గురువు చెప్పిన శాస్త్రాలను చదువుతూ ఆత్మ దర్శనం అయ్యే వరకే శాస్త్రాలు ఉపయోగపడతాయి. ఎప్పుడైతే ఆత్మ దర్శనం కలిగిందో ఇంక శాస్త్రాలు అవసరం లేదు, శాస్త్రాలు పట్టుకొని కూర్చోవల్సిన అవసరం లేదు. అందుకే బుద్ధుడు "నదిని దాటడానికి నావ కావాలి కానీ, నదిని దాటాక నావ అవసరం లేదు" అని చెప్పాడు. అలాగే మీకు ఆత్మ దర్శనం కలిగే వరకే శాస్త్రాలు కానీ ఆత్మదర్శనం కలిగాక ఇంక శాస్త్రాలతో పని లేదు. "నువ్వు ఆత్మ అని అనుభూతి చెందాక ఇంక శాస్త్రాలు అవసరం లేదు, దాన్ని కూడా వదిలేయాలి అని  ముక్తోపనిషత్తులో రాముడు ఆంజనేయ స్వామికి చెప్పటం జరిగింది.

"శాస్త్రాలు, ఉపనిషత్తులు కూడా , నీకు ఆత్మానుభూతి వచ్చే వరకు చదువు, ' సర్వం కల్విదం బ్రహ్మ' అని నీకు అనుభూతి కలిగిన రోజున అన్ని వదిలేసి నువ్వు ఆ అనుభూతిలో ఉండు, దైవంగా ఉండు" అని చెప్పడం జరిగింది.

ఏదైనా ఈ విద్య నేర్చుకున్నప్పుడు పరమాత్మ మీద, గురువు మీద అచంచలమైన భక్తి ఉన్నప్పుడే ఆధ్యాత్మికతలో మీరు పురోగమనం పొందుతారు. మధ్య మధ్యలో అనుమానం వచ్చినప్పుడు వెనక్కి వెళ్లిపోతారు. ఈ విద్య ఎప్పుడూ కూడా ప్రాపంచిక జీవితంలో సత్ చరిత్ర, సత్శీలాలకు మాత్రమే వంటబడుతుంది. ఏ మాత్రం ఆశ ఉన్నా ఆశయాన్ని సాధించలేరు. మీరు ఈ భూమ్మీదకి ఎందుకు వచ్చారో మీకు అర్థమైనా మధ్యలో మాయకు వశమై కోరికలు పుడుతూ ఉంటాయి. కానీ వెంటనే నా వాస్తవానికి నేనే సృష్టికర్తను అని గురువు చెప్పిన మాటలు గుర్తు చేసుకోవాలి.

మరి ఆత్మ విద్య, బ్రహ్మ విద్య నేర్చుకోవాలి అంటే ముందు గురువు మీద భక్తి, గురువు మాట మీద విశ్వాసము ఈ రెండు ఉన్న రోజున త్రికరణ శుద్ధిగా భగవంతుని అంటే ఆత్మమీద భక్తి పెంచుకుంటే  ఏ కష్టమూ లేకుండా

నేర్చుకుంటారు. ఈ విద్య నేర్చుకోవడానికి భూమి మీదకి వచ్చామని మనం గురువు ద్వారా తెలుసుకున్నాక మీ దృష్టి ఇతర విషయాల మీద ఉండకూడదు. అలాగే ఆత్మ మీద దృష్టి ఉన్నవాడు ఈ రెండు విద్యలు చక్కగా అధ్యయనం చేయగలుగుతాడు.

ప్రపంచం మీద దృష్టి ఉన్నవాడు ఒక అడుగు ఇందులో, ఒక అడుగు అందులో వేస్తూ సాధించవలసిన టైంలో ఏమీ సాధించలేడు. అందుకే ప్రతి శిష్యుడు కూడా గురువు మీద, ఆత్మ మీద అపారమైన భక్తిని పెంచుకుంటే ఈ విద్య చాలా తొందరగా నేర్చుకోగలుగుతాడు. మీ కర్మలు దగ్ధం చేసుకోవాలంటే ఈ ఆత్మ విద్య ద్వారా జ్ఞానం పొందాలి.

దానికి భక్తి శ్రద్ధ రెండు ఉండాలి, మాట మీద విశ్వాసం ఉండాలి, గురువు చెప్పిన ప్రతి విషయాన్ని విశ్వసిస్తేనే ఆచరణలో పెట్టుకోగలరు. మరి ఇవన్నీ అర్థం చేసుకుంటూ ఆచరణలో పెట్టుకుంటూ ఈ మార్గంలో ముందుకు సాగాలి.


## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# సాధన చేస్తున్నా జ్ఞానం పొందలేకపోవడానికి కారణాలు

అందరూ ఆత్మ స్వరూపులే, అందరిలోనూ ఆత్మ ఉంది కానీ జ్ఞానాన్ని కొంతమంది పొందుతున్నారు, కొంతమంది ఎందుకు పొందలేక పోతున్నారు. దానికి కారణం ఈరోజు తెలుసుకుందాం.

సర్వం కల్విదం బ్రహ్మ అని మీరు తెలుసుకున్నారు, అందరికీ బోధిస్తున్నారు అంటే ఈ సృష్టిలో ఉన్న జీవులు, జీవరాశులు అన్నీ కూడా ఆత్మ స్వరూపమే అని ఒక్క మానవుడే తెలుసుకోగలడు. కాని ఈ మానవుల్లో కొంతమంది మాత్రమే ఈ జ్ఞానం పొందగలుగుతున్నారు. కొంతమంది గురువు వచ్చినా ఈ జ్ఞానం పొందలేక పోతున్నారు.

ఈ జ్ఞానం పొందలేకపోవడానికి కారణాలు

**1. ఏకాగ్రత లోపించడం:**

గురువు చెప్పే విషయాల మీద ఏకాగ్రత ఎక్కువగా ఉండాలి, ఆ ఏకాగ్రత లోపించిన వాళ్ళలో జ్ఞానం పెరగదు. ఇప్పుడు మీరు ఏదైనా ఒక విషయాన్ని తదేకంగా వింటున్నప్పుడు మళ్లా ఇంకొక విషయం మీద దృష్టి పెడితే మీ ఏకాగ్రత లోపిస్తుంది.

ఉదాహరణకు ఉదయం జూమ్ క్లాస్ జరిగేటప్పుడు కొంతమంది వంట చేసుకుంటూ క్లాస్ వింటూ వింటారు. అప్పుడు సగం దృష్టి క్లాసు మీద, సగం దృష్టి వంట మీద ఉంటుంది. అలా మీరు ఎన్ని సంవత్సరాలు జ్ఞానం విన్నా, ఎంత సాధన చేసినా పూర్ణ జ్ఞానం పొందలేరు. అందుచేత సాధనలో ఏకాగ్రత అత్యంత అవసరం.

అందుకే నేను అందరికీ చెప్తూ ఉంటాను ఒక్క అరగంట పనులను ఆపి ఏకాగ్రతగా క్లాసు వినండి, ఆ తర్వాత పనులు చేసుకోండి అంటాను.

**2. మనసు మలినం కావడం:**

ప్రాపంచిక జీవితంలో ఉన్నప్పుడు చాలా శుద్ధత్వంలో ఉండగలగాలి,

మలినమైన మనసుతో జ్ఞానం ఎవ్వరూ పొందలేరు. ప్రాపంచిక విషయాల మీదకు మనసును పదే పదే పంపుతున్నప్పుడు అది ఎక్కువ విషయ సేకరణ చేస్తూ ఉంటుంది. అప్పుడు మళ్లీ మనసు మలినం అవుతుంది.

సాధన చేసి మనసును శుద్ధత్వంలో ఉంచుకుందాం అనుకుంటారు, గంటలు గంటలు సాధన చేస్తారు మరలా ప్రపంచంలోకి వెళ్లి ఆ విషయ సేకరణ వల్ల మరలా మనసు మలినం చేసుకుంటారు.

ఒకటి ఏకాగ్రత లోపించడం, రెండు మనసుని మలినం చేసుకోవడం, ఈ రెండు కారణాల వల్ల గురువు చెప్తున్నప్పటికీ మీరు జ్ఞానం పొందలేక పోతారు, అందరం ఆత్మ స్వరూపులైనా ఆ జ్ఞానాన్ని కొంత మందే పొందడానికి కారణం ఇవే.

ఉపమానం: నీరు నిశ్చలంగా, నిర్మలంగా ఉన్నప్పుడు ఆ నీటిలో ఆకాశంలోని చందమామ చాలా స్పష్టంగా కనిపిస్తుంది. కానీ ఆ నీరు కదులుతున్నప్పుడు, లేదా ఆ నీరు మురికిగా ఉన్నప్పుడు ఆ చంద్రబింబం స్వచ్ఛంగా కనిపించదు. నీరు కదులుతుంటే చందమామ కూడా కదులుతున్నట్టుగా అనిపిస్తుంది. అలాగే మనసు స్వచ్ఛంగా లేకపోతే జ్ఞానం స్పష్టంగా కనిపించదు. మనసు మురికిగా ఉన్నప్పుడు జ్ఞానం ఆత్మ నుంచి బయటికి రాదు.

**3) ఇంద్రియ నిగ్రహం:**

ఇంద్రియాలకి వశ పడినవాడు పశుత్వంలో ఉంటాడు. ఇంద్రియాల ను వశంలో ఉంచుకున్నవాడు శివత్వంలో, ఈశ్వర తత్వంలో ఉన్నట్టే. ఇంద్రియాలకి బానిసై మనసు మురికి చేసుకుంటే జ్ఞానం రాదు. పశుతత్వం అంటే పరాధీన బ్రతుకు. ఇంద్రియాలకు లోబడినప్పుడు పరాధీన బతుకు అవుతుంది.

ఇంద్రియాలను వశంలో ఉంచుకుంటూ విషయ సేకరణ చేయ

నప్పుడు మీరు ఈశ్వర తత్వంలోకి వెళతారు, అప్పుడు మాత్రమే మీకు జ్ఞానం పెరుగుతుంది.

బాహ్యంగా మీ మనసు ఎంతగా పరుగులు తీస్తే మీ ఆత్మ శక్తి అంత ఖర్చవుతుంది, జ్ఞానం పెరగడానికి అది ఉపయోగపడదు. అందుకే ఈ ప్రయత్నాలన్నీ జ్ఞానం కోసమే అని మీఅందరికీ తెలుసు. జ్ఞానం పొందితే కానీ మోక్షం లేదు అని మీరు ఎన్నో సార్లు తెలుసుకుంటున్నారు.

అందుకే ఇంద్రియ నిగ్రహం అని గురువులు పదే పదే చెప్తారు. ఒక్క ఇంద్రియ నిగ్రహం లేకపోయినా మనసు మురికి అవుతుంది.

తెల్లని గోడ మీద చిన్న మచ్చ పడితే అందరి దృష్టి ఆ మచ్చ మీదే ఉంటుంది. అలాగే మీ మనసు మీద విషయ సేకరణ అనే మచ్చ పడితే జ్ఞానం వికసించదు.

అందరూ ఆత్మ స్వరూపులైనా ఎవరి లోపాల వల్ల వాళ్ళు జ్ఞానాన్ని పొంద లేకపోతున్నారు. జ్ఞానం పొందాలి అనుకునే వాళ్ళకు ముందు ఆత్మ మీద అచంచలమైన భక్తి ఉండాలి. అంటే ఆత్మ అంటే భగవంతుడు అని మనం తెలుసుకున్నాం. "ఆ భగవంతుడు వల్ల ఈ సృష్టి కార్యం నడపబడుతుంది, ఈ సృష్టిలో నేను హాయిగా జీవించగలుగుతున్నాను, ఆ భగవంతుడు నా శరీరాన్ని కాపాడుతున్నాడు, సృష్టి అంతా ఉండి సృష్టిని కాపాడుతున్నాడు" అని ఎంతగా మీరు తెలుసుకుంటే మీకు అంతగా భగవంతుడి మీద భక్తి ఉంటుంది.

ఆ భక్తి ఉన్నప్పుడే సాధన ఇంకా బాగా చేయగలుగుతారు, స్వాధ్యాయం చేస్తున్నప్పుడు కూడా చాలా ఏకాగ్రత ఉండాలి. అందుకే ధ్యాని జీవితం లో ఏకాగ్రత ఉంటేనే జ్ఞానం పొందగలడు అని పదే పదే గురువులు చెప్తారు.

**4. దృఢ దీక్ష:**

దృఢ దీక్ష అంటే సాధన ఒక దీక్ష లాగా చేయాలి. ఇప్పుడు మీరు చాలా రకాల దీక్షలను చూస్తున్నారు. అయ్యప్ప దీక్షలని, హనుమాన్ దీక్ష అని, శివ దీక్షలని చాలా మంది చేస్తూన్నారు. ఆ 40 రోజుల దీక్షలో ఎంత శ్రద్ధగా ఉంటారో అలాగే మీరు కూడా జీవితాంతం దీక్ష పట్టి గురువు చెప్పిన ఆహార నియమాలు పాటిస్తూ, గురువు చెప్పిన సాధన, స్వాధ్యాయం చేస్తూ, జ్ఞానం పొందడానికి ప్రయత్నించాలి. నాకు ఆత్మ దర్శనం కావాలి అనే దృఢ దీక్ష మీకు ఉండాలి.

**4. సర్వ సంఘ పరిత్యాగం:**

సర్వ సంఘ పరిత్యాగం అంటే ఈ సంఘులో అన్నీ కావాలనుకుంటారు, అన్నీ అనుభవించాలనుకుంటారు కానీ ఆత్మను పొందాలి అనుకున్నప్పుడు, సృష్టికర్త దగ్గరకు చేరుతున్న మీరు, సృష్టికర్తని తెలుసుకుంటున్న మీరు, ఈ సృష్టికర్త సృష్టించిన సృష్టిని వదులుకోగలిగే ధైర్యం మీకు ఉండాలి.

ఎందుకంటే సృష్టిలోని సుఖాలు, ఆనందం సముద్రంలోని నీటి బొట్టంత, అదే పరమాత్మ వద్ద సముద్రమంత ఆనందం ఉంది. అందుచేత నీటి బొట్టు కోసం సముద్రాన్ని వదలకూడదు.

సర్వ సంఘ పరిత్యాగం అంటే ఈ సృష్టిలో అన్ని వదిలి ఎలా జీవించాలి అనుకుంటారు? కానీ పరమాత్మని తెలుసుకోగలిగితే సముద్రం అంత ఆనందం ఉంది, ఈ సృష్టి మనకు నీటి బొట్టంత ఆనందం ఇస్తోంది అనేది అర్థమైనప్పుడు సర్వ సంఘ పరిత్యాగానికి మీరు సిద్ధమైపోతారు.

**5. అహంకారం:**

అలాగే ఆత్మ జ్ఞానికి అహంకారం ఉండకూడదు అని ఎన్నో సార్లు మనం చెప్పుకుంటూనే ఉన్నాం. ఎందుకు అంటే చీమంత అహంకారం ఉన్నా ఈ మార్గంలో పడిపోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి మీరు ఎదుగుతున్న కొద్ది చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకు అంటే ఎదుగుతున్న కొద్ది మీరు

మాయకు వశం అవుతారు.

ఎవరైనా నువ్వు బాగా సాధన చేస్తావు అన్నా, బాగా క్లాస్ చెప్తావు అన్నా, నీకు శ్రద్ధ ఎక్కువ అన్నా, ప్రక్కవాడు మిమ్మల్ని 10 నిమిషాలు పొగిడినా మీకు వెంటనే అహంకారం వస్తుంది. అదే మాయ, ఆ మాయను దాటాలి ప్రతిఒక్కరూ. మీరు ఎంత ఎదిగినా ఎప్పుడూ కూడా ఒకటే అనుకోవాలి నేను ఇంకా ఆత్మ దర్శనం పొందలేదంటే నేను ఎదగవలసింది ఇంకా ఉంది, చేయవలసిన సాధన ఇంకా ఉంది, పొందవలసిన జ్ఞానం ఇంకా ఉంది, జ్ఞానం పెంచుకోవడానికి స్వాధ్యాయం చేయాలి, గురువు చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టుకోవాలి అని ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి. చేసిన పని మీద దృష్టి కాదు చేయవలసిన పని మీద దృష్టి పెట్టినప్పుడు మీకు అహంకారం రాదు.

**6. నిశ్చింత:**

అలాగే నిశ్చింతగా ఉండగలగాలి, ఎందుకు అంటే ఈ సృష్టి అంతా భగవంతుడే అని తెలిసినప్పుడు అన్నిటికీ మీరు సిద్ధం అయిపోవాలి. అందుకే పత్రి గారు ఏమంటారంటే "నీ జీవితంలో ఏదైనా వస్తుంటే వస్తోందని సంబరపడకు, పోతే పోయిందని బాధపడకు ఏది శాశ్వతం కాదు, ఈవేళ వస్తుంది అని సంబరపడ వద్దు, రేపు పోయినప్పుడు బాధ పడొద్దు, వచ్చే వన్నీ పోయేవే, సృష్టించే వన్నీ నశించేవే" అని అన్నారు. ఈ విషయాలు మీరు తెలుసుకున్నప్పుడు పోయినప్పుడు దుఃఖం రాదు. వచ్చినప్పుడు సంతోషము రాదు నిశ్చింతగా ఉంటారు.

ఏదైనా కావాలి అనుకుంటే చింత, 'వస్తే రాని పోతే పోనీ, ఉంటే ఉండని' అనుకుంటే నిశ్చింతగా ఉంటారు. మీ చిత్తం ఎప్పుడు నిశ్చంతగా ఉంటుందో అప్పుడు సాధన బాగా కుదురుతుంది.

**7. భావాతీత స్థితి:**

భావాతీతం అంటే ఇలా ఉండాలి అని నువ్వు భావిస్తున్నావు. కాని ఇలా వస్తుంది, నేను ఇలా ఉండాలని అనుకోకూడదు, చేయవలసిన సాధన చేయాలి. నేను ఆత్మని అని ఎరుకలో ఉంటూ గురువు చెప్పిన సాధన చేయాలి.

కానీ నేను చేసింది ఎక్కువ అనే ఒక భావం మీలో రానివ్వద్దు, అది కూడా తప్పే. ఆ భావం మీలో వచ్చిందా మళ్ళీ మీకు అహంకారం వస్తుంది. కానీ ఈ రోజు ఇంత చేశా, రేపు ఇంకా ఎక్కువ చేయగలగాలి అని మీకు ఉండాలి కానీ చాలు అనే భావం ఎప్పుడూ ఉండకూడదు.

**8. వినయం, మౌనం:**

అలాగే ప్రతి విషయాన్ని ఆచి తూచి మాట్లాడటం నేర్చుకోవాలి. ఎందుకంటే ఎదగాలి అన్నప్పుడు ఒదిగే ఉండాలి, ఒదిగి ఉండడం అంటే గురువుతో మాత్రమే వినయంగా ఉండటం కాదు మీ నోటి ద్వారా ఇతరులను ఎన్నో మాటలు మాట్లాడితే ప్రతి దానికి ఒక కర్మ వస్తుందని భయపడుతూ మౌనంగా ఉండాలి.

మరి మీలో అహంకారం ఎప్పుడు నశిస్తుంది అంటే ఈ ప్రపంచంలో ఉన్నవి ఏవి శాశ్వతం కావు అని తెలుసుకున్నప్పుడు. కాని ఈ మాయకి వశమై మళ్ళీ అహంకారం పెంచుకుంటే అజ్ఞానంలో పడిపోతారు.

సాధన చేస్తున్న మీరు ఈ ప్రాపంచిక జీవితంలో జీవించక తప్పదు కాబట్టి మీ మాటలతో కాని, మీ చేతలతో కానీ ఎవరినైనా బాధపెడితే మీలో అహంకారం ఉన్నట్లే. అందుకే సాధకుడు ప్రతి విషయాన్ని గమనించుకుంటూ ఉండాలి. మరి చిత్తంలో చింతలు లేకుండా ఉంచుకుంటూ మరి ఏదైనా వదలడానికి సిద్ధంగా ఉండాలి. అన్ని ఒకేసారి వదలడం కాకుండా మెల్లి మెల్లిగా ఈ ప్రాపంచిక జీవితం నుంచి ఆధ్యాత్మికత వైపుకి పయనించాలి.

ఉదాహరణకు ప్రాపంచిక జీవితం గుర్తు చేసుకుంటే చిన్నప్పుడు నాకు ఇది కావాలి, నేను ఇదే తింటాను అని అంటాం, కొంచెం పెద్ద వాళ్ళం

అయినప్పుడు ఒక కాలేజీకి వెళ్లేటప్పుడు కాలేజీ టైమ్ అయిపోతే ఇంట్లో ఏది ఉంటే అది తిని వెళ్తాం అంటే అక్కడ కొంచెం వదులుతాం, ఆ తర్వాత పెళ్లై అత్తవారింటికి వెళ్లినప్పుడు అక్కడ మనకు నచ్చినట్టు కుదరదు కాబట్టి అప్పుడు అక్కడ కూడా కొంత త్యాగం చేస్తాం, ఆ తర్వాత పిల్లల కోసం ఇంకా కొన్ని కొన్ని వదులుకోవడానికి సిద్ధమవుతాం, ఇలా చిన్న చిన్నగా ఎలా వదులుకుంటామో, అలానే ఆ భగవంతుడిని తెలుసుకోవాలను కున్నప్పుడు ఈ సృష్టిలోని వాటిని కూడా ఒక్కొక్కటి వదిలేయాలి. అలా వదలినప్పుడు ఆ పరమాత్మను చేరుకోగలుగుతారు అని మహాత్ములు అందరు చెప్పారు.

ఈ సృష్టి అంతా మిథ్య, ఈ సృష్టిలో ఏదీ కోరుకోకూడదు అన్నీ అశాశ్వతమే అనే వైరాగ్యం వచ్చినప్పుడు అన్ని వదులుకోవడానికి సిద్ధపడతారు. అలా ఎప్పుడైతే ప్రపంచం మీద ఆసక్తిని తగ్గించుకుని పరమాత్మ మీద ఆసక్తిని పెంచుకుంటారో మీకు సాధన బాగా కుదురుతుంది.

మనందరికీ తెలుసు జ్ఞానమే మోక్ష స్వరూపం అని, ఆ మోక్షం పొందడానికి, ఆ జ్ఞానం తెలుసుకోవడానికి అనుక్షణము ప్రయత్నిస్తేనే మోక్షం పొందడానికి అర్హత వస్తుంది. జ్ఞానం మీద ఆసక్తి లేదు, గంటలు గంటలు చేసినా నాకేం బుర్రకి ఎక్కదు అంటే ఎక్కే వరకు జన్మలు తీసుకోవాలి, ఏది వద్దు అనుకుంటావో అది చేసే వరకు జన్మలు వస్తాయి, అన్నిటికీ ప్రయత్నించాలి.

మొత్తం మీద మనసుని శుద్ధంగా ఉంచుకొని, ఎవరికీ హాని కలిగించని జీవితం జీవిస్తే చాలా చక్కగా మీ ఆత్మ శక్తిని, జ్ఞానం పొందడానికి ఉపయోగిస్తారు. దానికోసం మాత్రమే ధ్యానం, ఆ జ్ఞానమే పరమాత్మ స్వరూపం అని తెలుసుకోవాలి. ఆ జ్ఞానం పూర్ణంగా తెలుసుకుంటేనే కానీ పరమాత్మ దర్శనం కాదు కాబట్టి ఆత్మ శక్తిని ఎలా ఉపయోగించాలో తెలుసుకుంటే మీరు జ్ఞానవంతులు కాగలరు.

# ఆత్మానుభూతి పొందాలంటే?

మీరు ఆత్మానుభూతి పొందాలని, ఆత్మని తెలుసుకోవాలని ఈ ధ్యాన సాధన చేస్తున్నారు. మరి మీరు పొందుతున్నారా? తెలుసుకున్నారా? అని విచారణ చేసుకుంటూ ముందుకు వెళ్ళాలి. ఆ ఆత్మానుభూతి పొందేవరకు, ఆ అమృతత్వ స్థితి వచ్చేవరకు ప్రయత్నిస్తూనే ఉండాలి, తెలుసుకుంటూనే ఉండాలి.

ఎందుకంటే మీకు ఆ పూర్ణమైన ఆనంద స్థితి వచ్చేవరకు ఆత్మానుభూతి కలిగినట్టు కాదు, అమృతత్వ స్థితి వచ్చినట్టు కాదు. ఆత్మానుభూతి పొందినప్పుడే అమృతత్వము అంటే చావు పుట్టుకలు లేని స్థితి పొందినట్టు. దానికి ఇంకో అర్థం కూడా చెప్పుకుంటారు దుఃఖము, సంతోషము రెండు లేని స్థితి. మరి ఆ స్థితి మీకు ఉందా? అంటే లేదనే చెప్పవచ్చు.

అంటే ఇప్పుడు మీరు జీవాత్మలమని చెప్పుకుంటున్నారు. ఆత్మే దైవము అని తెలుసున్నా ఇంకా దుఃఖము వస్తుంది, సంతోషము వస్తుంది. దుఃఖం వస్తోంది- పోతోంది, సంతోషం వస్తోంది-పోతోంది, మరి ఎందుకు ఇలా ఉంది అంటే దానికి కారణం మీరే. 'ఆత్మ'... అనాత్మ అయిన మనసుతోటి, శరీరంతోటి మమేకమై దుఃఖంలోను, సంతోషంలోను ఉంటుంది.

అనాత్మ అంటే మారేవి. మనసు ఎప్పుడూ మారేదే, మారే వాటిలో ఉండి తాను కూడా మారే వాడిని అంటే మరణించే వాడిని అని అనుకుంటున్నాడు జీవుడు.

కానీ ఆత్మే జీవుడు కూడా, తాను కూడా ఆత్మే కానీ మనసుతో మమేకమయ్యాడు. ఈ ఆత్మ మనసుతో మమేకమై తాను జీవుడు అనుకుంటూ, తనకి మరణం ఉంది అని అనుకున్నప్పుడల్లా ఆ మనసు యొక్క లక్షణాలు ఆత్మకి ఆరోపించుకుంటున్నారు. అంటే కారణం ఆత్మ భగవంతుడే అని తెలిసినా మనసుతో మమేకమై మరణం అంటే భయం.

ఆత్మ అంటే భగవంతుడు అని చెప్పుకున్నాం, అది ఒక శక్తి, మారే వాటితో మమేకమై తాను కూడా మారేవాడిని అనుకుంటూ నశించే వాటితో మమేకమై తాను కూడా నశించేదే అనుకుంటూ దుఃఖంలో ఉంటున్నారు.

మరి ఏదైనా తాత్కాలికమైన చిన్న చిన్న సంతోషాలు వస్తాయి, సంతోషపడిపోతూ, దుఃఖపడిపోతూ, మరి తానే భగవంతుని అనే విషయం మర్చిపోయారు. మరి ఎవరు ఈ అమృతత్వాన్ని పొందగలరు? అంటే ఎవరు శాశ్వతమైన ఆత్మానుభూతిని పొందుతారో! వాళ్ళు మాత్రమే అమృతత్వాన్ని పొందగలరు అని మహాత్ములు మనకి చెప్పడం జరిగింది.

అది ఎప్పుడు పొందుతారు అంటే మీరు చూడండి మీ దృష్టి బయట ప్రపంచంమీద ఉన్నప్పుడు  అభిప్రాయాలు కూడా మార్చుకుంటారు. ఎక్కడైనా మరణాన్ని చూసినప్పుడు నేను కూడా చనిపోతానేమో అనే ఒక భయంతో జీవిస్తున్నారు. అంటే ఈ ప్రేమ అనేది మనసుతో మమేకమైనప్పుడు వస్తుంది. మన దృష్టి ప్రపంచం వైపు ఉన్నప్పుడు అభిప్రాయాలను మార్చుకునే దృష్టి వుంటుంది. ఇలా ఉన్నంత కాలం ఆత్మానుభూతిని పొందరు, అమృతత్వ స్థితిని పొందలేరు.

మరి ఈ దుఃఖము, ఈ మార్పులు ఇవన్నీ  పోవాలి అంటే ధ్యాన సాధన చేసి ఆత్మ జ్ఞానం పొందాలి. అందుకే కొందరు బాధ కలిగినప్పుడు ధ్యానంలో కూర్చుండిపోతారు. అంటే సమస్తానికి పరిష్కారం ధ్యానం అని వీళ్ళకి తెలుసు. అజ్ఞానులు తెలియక శాశ్వతమైన దుఃఖంలో ఉంటారు.

నీలోనే ఉన్నవాడిని నువ్వు తెలుసుకోవాలంటే నీలోనికి ప్రయాణం చేయాలి అనే పరమ సత్యాన్ని మీరు తెలుసుకున్నారు కాబట్టి, మీరు అంతర్ముఖం అయ్యి ఆ ఆనందాన్ని  అనుభవిస్తున్నారు.

మరి పూర్ణంగా ఆ ఆనందాన్ని అనుభవించినవాడే అమృత తత్వాన్ని పొందగలడు అని చెప్తారు. ఆ అమృత తత్వాన్ని పొందాలి అంటే నువ్వు బాహ్యంలో వెతుకుతే దొరకదు. అంతరంలో ఆత్మను దర్శించినప్పుడే

దొరుకుతుంది. మరి నువ్వు లోనికి ప్రయాణించినప్పుడే శాశ్వతమైన ఆనంద స్వరూపుడిని పొందగలిగిన వాడివి అవుతావు.

అంటే ఇప్పుడు మీరు ఏమి అర్థం చేసుకోవాలి అంటే? మార్పు చెందే మనసుతోటి, మమేకమైన ఆత్మ తాను జీవుడిని అని అనుకుంటూ దుఃఖం పొందుతూ, గురువు ద్వారా నేర్చుకున్న ధ్యానం ద్వారా తాను శాశ్వితుడిని, నేను మరణించేవాడిని కాదు, నాకు మరణం లేదు అని తెలుసుకుంటాడు.

జీవుడు ఎప్పుడైతే అది తెలుసుకుంటాడో! సాధన చేస్తూ ఉంటాడో! ఆ జ్ఞానం పొందుతూ ఉంటాడు. ఆ జ్ఞానం పొందినప్పుడు మాత్రమే ఆత్మానుభూతి కలుగుతుంది. మీరు గమనిస్తే బాహ్యంగా ఉన్నప్పుడు అన్ని చింతలే, అది లేదు, ఇది లేదు వాళ్ళకి అది ఉంది, ఇది ఉంది అని చింతలో ఉంటారు.

కానీ మీరు కళ్ళు మూసుకొని ధ్యానం చేస్తున్నంత సేపు ఏ చింత ఉండదు. ఎందుకు అంటే లేవనే బాధ కళ్ళు విప్పినప్పుడు ఉంటుంది, అక్కడ మనసు ఉంది. కానీ కళ్ళు మూసుకున్నప్పుడు ఆ మనసు లేని స్థితిలో ఆత్మతో మీ దృష్టి మమేకమైనప్పుడు, బాహ్యంగా తిరిగిన మనసు ఆత్మ వైపు తిరిగినప్పుడు దానికి మొదట్లో కోరికలు తగ్గుతూ తగ్గుతూ మరి ఆత్మలోనే లయమైన మనసుకి ఏ ఏ కోరికలు ఉండవు.

సృష్టి అంతా నేనే అయినప్పుడు, నేను సృష్టించినవి నేను కోరుకుని సాధించాలి అనుకోవడం ఏమిటి అనే అభిప్రాయంలోకి వస్తారు. అంటే ఇప్పుడు నేను ఆత్మని, నువ్వు ఆత్మవే, సర్వజీవులు ఆత్మ స్వరూపులే, సృష్టి అంతా ఆత్మమయమే అని తెలుసుకున్నారు.

కానీ మీ దృష్టి అంతరదృష్టి అయినప్పుడు ఆ అనుభూతి పొందుతూ, పొందుతూ ఇంక బాహ్యంలో ఉన్నవి కోల్పోతుంది. కోల్పోతూ సృష్టి అంతా నేనే, ఈ సృష్టిని నేనే అని తెలుసుకుంటుంది. ఇది చిట్ట చివరి స్థితి, ఇదే

అమృతత్వ స్వభావము. ఇంక ఏది కోరుకోదు, ఈ సృష్టి అంతా నేనే అయి ఉన్నాను, నాకు లేనిది, నేను కానిది ఏముంది అని తెలుసుకున్న జీవుడు అప్పుడు దేవుడు అవుతాడు.

అంటే కోరికను వదిలి అంతా తానే అని తెలుసుకుని దేవుడు అవుతాడు. కానీ ఇది తెలుసుకోవాలి అంటే చాలా చాలా జ్ఞానం పొందాలి. ప్రతిదాన్ని విచారణ, విశ్లేషణ చేయమని  మహాత్ములు చెప్తారు? మరి వశిష్ట వారు 'విచారణే పరమజ్ఞానం' అని చెప్పారు.

అంటే జీవుడిగా ఉన్న నేను విచారణ వల్ల దేవుడిగా ఎదుగుతాను అనే చిన్న విషయాన్ని మర్చిపోయి ఉన్నది ఉన్నట్టుగా చూస్తున్నారు కానీ ఆ ఉన్నదాని వెనకాల ఉన్న యదార్థాన్ని  చూడలేకపోతున్నారు. ఉన్నదాని వెనకాల ఉన్న యదార్థాన్ని నువ్వు గుర్తించగలిగితే నువ్వు ఎవరవో నీకు అర్థమవుతుంది.

చూడండి సృష్టిలో జీవులన్నీ కూడా ప్రాణం వల్లే ఉన్నాయి.  అంటే ప్రాణం లేకపోతే జీవుడు నిర్జీవుడు అవుతాడు. ఆ ప్రాణం ఉంటేనే జీవుడికి చలనం ఉంటుంది, కానీ ఆ ప్రాణం వెనకాల ఉన్న ప్రాణశక్తి ఎవరు? ఆ ప్రాణానికి ఆ శక్తిని ఇస్తున్నది ఎవరు? అని కొంచెం విచారణ చేస్తే ఆ ప్రాణ శక్తి కూడా పరమాత్మే! పరమాత్మే ప్రాణానికి ఆ శక్తిని ఇవ్వబట్టే జీవులు బతుకుతున్నాయి.

అందుకే పదార్థాన్ని చూడటం కాదు, యదార్థాన్ని తెలుసుకుంటేనే జ్ఞానం పెరుగుతుంది అని మనకి అర్థమవుతుంది. మరి ప్రతి జీవికి ఆయువు పెంచుతున్నది ఆ ప్రాణశక్తే.

చూడండి అంతర్దృష్టి లేనంత కాలం, బాహ్య దృష్టి ఉన్నంత కాలం ఇంత లోతుగా ఆలోచించరు.

నీ బుద్ధితో తెలుసుకున్న జ్ఞానంతో అనుభూతిని పొందలేవు. ఎందుకంటే బుద్ధి ఆత్మ ఇలా వుంటుంది అని వర్ణించలేదు. అసలు ఆ బుద్ధికి శక్తిని ఇచ్చేది కూడా ఆత్మే. అది భాహ్య విషయాలను గ్రహిస్తుంది.

అందుకే  ధ్యానానికి రాకముందు మీరు చదువుతున్న పుస్తకాలు కొంచెం కొంచెంగా అర్థమవుతాయి, కానీ ధ్యానం ద్వారా బుద్ధి వికసించే కొద్దీ అంతరార్థాలు తెలుస్తూ వుంటాయి.

ధ్యాన మార్గంలోకి వచ్చి బుద్ధి వికసింప చేసుకున్నా పుణ్యకార్యాల వల్ల, మరి పూజల వల్ల శాశ్వతమైన ఆనంద స్థితి రాదు, ఆత్మని ఆశ్రయిస్తేనే శాశ్వతమైన ఆనంద స్థితి వస్తుందని తెలుసుకుంటారు.

ఈ ఆత్మానుభూతి అన్నది ఎవరికి వాళ్లే, అంతర్ముఖం ద్వారా ఆత్మని చేరుకుంటేనే పొందగలరు.

మీరు నిరాకారమైన ఆత్మని, నిరాకారుడైన భగవంతుడిని ఎవరికి వాళ్ళు అంతర్ముఖులై అనుభూతిని పొందాలి. ఆ పొందిన అనుభూతిని మాటలతో చెప్పలేనిది, వాక్కుకి అందనిది, దృష్టి చూడలేనిది, చెవులు వినలేనిది, బుద్ధితో నిర్ణయించలేనిది ఆ అనుభూతి. ఆఖరికి మీకు థర్డ్ ఐ వచ్చినా అది కనబడదు. ఎందుకంటే ఈ ఇంద్రియాల న్నిటికీ శక్తిని ఇస్తున్న ఆత్మ ఇంద్రియాలకి అతీతం. కానీ నీ ఇంద్రియాలకి శక్తి ఆత్మే ఇస్తుంది. కానీ ఇంద్రియాలు ఆత్మను వ్యక్తం చేయలేవు.

అందుకే ప్రతి ఒక్కళ్ళు తెలుసుకోవాల్సింది ఇంద్రియాలకి శక్తినిస్తున్న ఆత్మ, ఇంద్రియా తీతం, అది మాటల్లో కొలవలేనిది, కండ్లతో చూడలేనిది.

ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే నేను అనుకున్నట్టు నేను ఉండలేక పోతున్నాను అంటే నాకు సాధనలో లోపం, నా బుద్ధిలో లోపం ఉంది, అంటే గురువు మాటలు గ్రహించగలిగేటంతగా బుద్ధి వికసించలేదు అని మీకు అర్థంఅవ్వాలి. మరి సరైన సాధన చేయకపోతే నీకు ఆత్మానుభూతి ఎప్పటికీ కలగదు.

అందుకే సరైన సాధన, సరైన జ్ఞానం అంటారు. సరైన సాధన అంటే మీ సాధన ఆత్మానుభూతిని కలిగించగలగాలి, మీరు వింటున్న జ్ఞానం అంతా ఆత్మ కోసమే ప్రయత్నించాలి,

ప్రాపంచికంగా కోరుకుంటున్నారు అంటే మీది సరైన సాధన కాదు. మరి "శ్వాస మీద ధ్యాస" పెట్టిన వాడు సరైన జ్ఞానం పొంది ఆత్మానుభూతికే ప్రయత్నిస్తాడు. అందుకే మహాత్ములు ఒక మాట చెప్తారు. ప్రాపంచిక కోరికలు నీకు ఎంతగా ఉంటే నువ్వు అంతగా దిగజారిపోయినట్టే. ఆత్మే పరమాత్మ కాబట్టి నువ్వు ఆ పరమాత్మ కోసం ధ్యానం చేస్తే నువ్వు అంతగా ఎదుగుతున్నట్టే.

మీ జీవితంలో మీరు ఎదుగుతున్నారా? లేదా? నేను ఇంకా కోరికలతో ఉన్నానా? కోరికలు తగ్గించుకుంటూ నేను ఎవరో తెలుసుకుంటున్నానా? గురువు నువ్వు ఆత్మవని చెప్పాడు. అవునా? కాదా? అన్నవి తెలుసుకోవాలి.

ముఖ్యంగా జ్ఞానం పొందడానికి కావలసింది బుద్ధి. అంటే ప్రాపంచిక మైన జ్ఞానం ఉంటే పరిమిత బుద్ధి. ఆధ్యాత్మిక విషయాలు నీకు అర్థ మవుతున్నాయి అంటే, నీ బుద్ధి పెరుగుతోందని తెలుసుకోవాలి.

అందుచేత ధ్యానం నేను ఎలా చేస్తున్నాను? ఎన్ని గంటలు కూర్చున్నాను అని కాదు, ఎంత శక్తిని పొందుతున్నాను? అన్నది కూడా గమనించుకోవాలి. ఆత్మ శక్తి ఎలా పెరుగుతుంది అంటే ప్రాపంచిక కోరికలు లేకుండా సాధన చేయగలిగితే నీ శక్తి పెరుగుతూ ఉంటుంది. ఆ ప్రాపంచిక కోరికలు ఉన్నప్పుడు చాలా ఎక్కువగా శక్తిని ఖర్చు పెడుతూ వుంటారు. మీరు రోజంతా కూర్చుని మౌనంగా మీరు చేసే పనులను గమనిస్తే మీరు ఎంత శక్తిని ఖర్చు పెడుతున్నారో! తెలుస్తుంది.

ఇంద్రియాలు అంటే కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు, అంతరేంద్రియం వీటన్నిటికీ శక్తిని ఇచ్చి నడిపిస్తున్నది ఆత్మే కాబట్టి ఆ ఆత్మ శక్తి పెంచుకుంటే నేను ప్రాపంచిక జీవితం కంటే ఆధ్యాత్మిక జీవితంలో ఉన్నత స్థితివలో ఉండగలను అనే నమ్మకం మీకు వస్తుంది. మరి కొద్ది రోజుల్లోనే మీరు ఆత్మానుభూతిని పొందగలరు.

ఈ క్లాస్ ఇంట్రెస్ట్ గా కూర్చుని వింటున్నారు అంటే మీరు ఆత్మ

స్థితిలో ఉన్నట్టే! ధ్యానం చేస్తున్నారు అంటే ఆత్మస్థితిలో ఉన్నట్టే! ఎక్కడ నాకే కొత్త విషయం దొరుకుతుందని నిరంతరము అన్వేషణ చేస్తున్నారు అంటే ఆత్మ స్థితిలో ఉన్నట్లే! ఆత్మ స్థితికి చేరారు కానీ ఆత్మానుభూతిని ఇంకా పొందలేదు. కాబట్టి నేను ఆ ఆత్మానుభూతిని పొందాలి అని కృషి చెయ్యాలి.

నేను ఆ ఆత్మానుభూతిని పొందాలి అమృత పుత్రుడిని కావాలి, అనే కాంక్ష మీలో ఉంటే మీరు కూడా ఈ జన్మలోనే తప్పకుండా సాధించగలరు. ఒక సాధకుడు ధ్యానం చేయడంలో తృప్తి పడిపోకూడదు. **“ప్రాపంచిక విషయాల్లో తృప్తి, ఆధ్యాత్మిక విషయాల్లో అసంతృప్తి వుండాలి”** అని బుద్ధుడు చెప్పాడు.

ఖాళీ టైం ఉంటే కళ్ళు మూతలు పడిపోతుంటాయి, ఎవరి మాట వినబుద్ధి కాదు. అది నిద్ర అనుకోకండి కూర్చుని ధ్యానం చేయడానికి 10 నిమిషాలు చాలు. కానీ జ్ఞానం పూర్తిగా వస్తేనే కానీ ఆత్మానుభూతి కలగదు అనే ఎరుక మాత్రం ఎప్పుడూ కోల్పోకూడదు. మరి ఈ విధంగా ఆత్మానుభూతిని పొందుతూ ఆనంద స్థితిలో వుండటానికి ప్రయత్నించాలి.




## ब्रह्मविध्वरिष्ठ तटवर्ति राज्यलक्ष्मी के हिन्दी किताब

1) एक और जन्म ........................................Rs.160/-
2) साधना में स्थितियाँ.................................. Rs.80/-
3) ज्ञान माला............................................. Rs.70/-
4) श्री दत्तात्रेय जी का 24 गुरूओं ।................. Rs.70/-
5) अगर मानव को योगी बनना है तो ?............ Rs.60/-
6) गुरु पूर्णिमा का विशिष्टता ......................... Rs.60/-
7) महात्माओं का संदेशों................................ Rs.50/-
8) मानव के कर्तव्यों .................................... Rs.50/-
9) गुरु पूर्णिमा का विशिष्टता ......................... Rs.50/-
10)शाकाहार ही मानव का आहार है !............... Rs.50/-

# పత్రీజీ బ్రహ్మర్షి గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించకముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం- రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) గీతాసందేశం - రూ.120/-
12) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
13) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం?- రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) ఆశ్చర్యకరమైన విషయాలు -రూ.70/-
40) మానవునిలోని చెడు -రూ.70/-
41) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు -రూ.70/-
42) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
43) మోక్షం అంటే? - రూ.70/-
44) కబీరు సందేశాలు-1 -రూ.70/-
45) కబీరు సందేశాలు-2 -రూ.60/-
46) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
47) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
48) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
49) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
50) అతీంద్రియ శక్తులు - రూ.60/-
51) ఆలోచించండి - రూ.60/-
52) నిర్వాణ మార్గం - రూ.60/-
53) ధ్యానులకు సూచనలు - రూ.60/-
54) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
55) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
56) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
57) మాస్టర్‌గా ఎదగాలంటే? -రూ.50/-
58) భగవంతుని ఇష్టులవ్వాలంటే-రూ.50/-
59) సంకల్పమంటే? - రూ.50/-
60) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
61) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
62) మూడురకాల భవిష్యత్తులు -రూ.50/-
63) అరిహంత్ - రూ.50/-
64) మూడురకాల జీవితాలు -రూ.40/-
65) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
66) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
67) బ్రహ్మం అంటే? -రూ.40/-
68) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
69) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
70) మహాత్ముల సందేశాలు - రూ.40/-
71) సత్యం - రూ.40/-
72) చక్రాలు - రూ.40/-
73) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
74) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
75) మౌన ధ్యానం - రూ.40/-
76) విదురుని సందేశాలు - రూ.40/-
77) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
78) శాకాహారమే మానవాహారం - రూ.15/-
79) అహింస మరియు శాఖాహారం- రూ.15/-



ధార్మికమైన జీవితము అంటే ధర్మవంతమైన జీవితం. అందుకే బుద్ధుడు “ధర్మం శరణం గచ్ఛామి” అని చెప్పడం జరిగింది. అంటే ధర్మాన్ని ఎవరైతే శరణు వేడుతారో వాళ్ళు గొప్పవాళ్ళు అవుతారు. ధర్మాన్ని శరణ వేడినవాడే సత్యాన్ని తెలుసుకోగలడు.

మీరు అనుకోవచ్చు నేను ఆత్మ, అంటే భగవంతుడు అని తెలుసుకున్నాను, విగ్రహం దేవుడు కాదని తెలుసుకున్నాను, సత్యం తెలుసుకున్నాను, కానీ ఆ సత్యాన్ని ఎందుకు దర్శించలేక పోతున్నాను? అంటే దానికి కారణం ధర్మాన్ని ఆచరిస్తేనే సత్య దర్శనం అని మహాత్ములు చెప్పారు. మరి ధర్మాన్ని ఎలా ఆచరిస్తాం? అసలు ధర్మం అంటే ఏమిటి? అన్నవి తెలుసుకోవాలి.

“ధర్మాన్ని నువ్వు రక్షించగలిగితే ఆ ధర్మమే దైవమై నిన్ను రక్షిస్తుంది” ధర్మాన్ని ఎప్పుడైతే ఆచరిస్తారో సత్యానికి దగ్గర అవుతారు. ధర్మము అంటే మీరు జీవించే ఒక కళ. ప్రతి విషయంలో ప్రతి నిమిషము ధర్మవంతమైన జీవితం జీవించగలిగితే అదే జీవన కళ అని చెప్తారు.

- బ్రహ్మవిద్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి

రూ.60/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|